57 360

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

ఆగస్ట్ 3, 2008

కథా నిలయం
శ్రీకాకుళం



విశ్వక్రీడా వైభవం

ఒలింపిక్స్

హ్యాపీ బర్త్‌డే

(2008 ఆగస్టు 3 నుంచి-2008 ఆగస్టు 9వరకు)

సాయిచెర్రి
3సం॥, ఆగస్టు-3
సీతాలు-శ్రీనివాస్
గద్వాల్

హరిప్రియ(సాయిబిట్టు)
10సం॥, ఆగస్టు-5
లక్ష్మి-శ్రీనివాస్
గద్వాల్

ఎన్.మమ్మి
1సం॥, ఆగస్టు-2007
రాణి-రవీంద్ర
ధర్మన్నగూడ-రంగారెడ్డి

జి. సాయిశ్రీ
ఆగస్టు-3
ఉమారాణి-రాజశేఖర్
సప్తగిరికాలనీ-కరీంనగర్



రేష్మిక
ఆగస్టు-8
సుజాత-మధు
ఏలూరు-ప॥గో



అభినవ సంపత్
1సం॥, ఆగస్టు-7
లక్ష్మి-గణేష్
బాలాపూర్ఎక్స్‌రోడ్స్-హైదరాబాద్

ఆకాష్‌కుమార్
7సం॥, ఆగస్టు-2001
సరోజ-యాదయ్య
తాటిపల్లి-మెదక్

జి.హిమకర్
7సం॥, ఆగస్టు-5
హిప్నోకమలాకర్
అశోక్‌నగర్-హైదరాబాద్

టి.ఉషశ్రీ
3సం॥,ఆగస్టు-2005
గీత-నందు
సాలగాంపురం-విశాఖ

కథా నిలయం
శ్రీకాకుళం

ప్రజా ఉద్యమాలే శరణ్యం

మన అతిథి

పేరు	:	కవులకుంట్ల రామన్న చౌదరి (కె.ఆర్. చౌదరి)
తల్లిదండ్రులు	:	గంగమ్మ, లచ్చన్న
పుట్టిన తేదీ	:	01-03-1940
జన్మస్థలం	:	జుంజరాంపల్లి (గ్రామం), రాయదుర్గం(మండలం),అనంతపురం (జిల్లా).
విద్యాభ్యాసం	:	ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)-1965 (కర్ణాటక, ధార్వాడ్), పిహెచ్‌డి-1980 (శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ)
పదవులు	:	ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, హెడ్, డైరెక్టర్(1983-2000), రాష్ట్ర శాస్త్ర సాంకేతిక విజ్ఞాన మండలి (ఆప్‌కాస్ట్), గ్రామీణాభివృద్ధి డైరెక్టర్, మెంబర్స్ సెక్రెటరీ(1987-91), 12 వామపక్షాల ఆధ్వర్యంలో రైతు సమస్యలపై వేసిన జస్టిస్ పి.ఎ చౌదరి కమీషన్ సభ్యులు. ఇంకా.... వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో క్రియాశీలక పదవులు.
ఇష్టపడేది	:	వ్యక్తుల నిరాడంబరత, నిజాయితీ, సామ్యవాదం.
ఇష్టపడనిది	:	వ్యక్తుల్లో హిపోక్రసీ, సామ్రాజ్యవాదం.
అవార్డులు	:	ఆచార్య ఎన్ జి రంగా అవార్డు- 2000 (ఉత్తమ వ్యవసాయ ఆర్థికవేత్త).
రచనలు	:	డబ్ల్యూటీవో విషవలయంలో రైతాంగం విలవిల, డబ్ల్యూటీవో నుండి భారతదేశం వైదొలగాలి, రైతుల ఆత్మహత్యల కారణాలు-పరిష్కారాలు, ఆంధ్ర ప్రదేశ్ రైతాంగ సమస్యలు విశ్లేషణ (1998), వ్యవసాయ ఉత్పత్తులు-మార్కెటింగ్ (2001), ప్రపంచీకరణ ఎవరికోసం?(2005) వంటి 20కి పైగా పుస్తకాలు, 300 పరిశోధనా పత్రాలు.

వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోవడానికి ప్రధాన కారణం సామ్రాజ్యవాద శక్తుల దోపిడీ. రైతులకు తమ సొంత ఆర్థిక వనరులు లేవు కాబట్టి కార్పొరేట్ మార్కెట్ శక్తులు రైతుల్ని దోపిడీ చేస్తున్నాయి. నేటి ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తూ రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. వ్యవసాయ రంగం నుండి కార్పొరేట్ సంస్థలు వైదొలగేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలే శరణ్యం. ఐక్య ఉద్యమాలను నిర్మించి ఉమ్మడి సమస్యలపై పోరాటాలను చేసే బాధ్యత వామపక్ష ప్రజాతంత్ర విప్లవ పార్టీలపైన ఉంది. సాహిత్యం, కళలు ఏ కొద్దిమందికో కాదు అవి ప్రజలకు ఉపయోగపడాలి. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి. ఈనాడు సమాజం అత్యంత స్వలాభపూరితమై, ఎలాంటి నీతీ నిజాయితీలను, విలువలను పాటించడంలేదు. విలువలు లేని సమాజం జీవచ్ఛవంలాంటిది. విలువలతో కూడిన సమసమాజాన్ని నిర్మించే లక్ష్యంతో కదలాలి. అదే అన్ని సమస్యలకు పరిష్కారం కాగలదు.



ఈ సంచికలో....

టపా	...	2
సలహాలు	...	3
రుచి	...	7
సీరియల్	...	8
సినిమా	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...



చూద్దామా ... 4
అలనాటి వైభవాల ఆనవాలు
మైసూర్

లాహిరి... లాహిరి	...	20
మనసా... తెలుసా	...	22
విజ్ఞాన వీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

మంచిపుస్తకం ...6
నాయన
కవితారాధన

కథ 18
మిలట్రీ పెట్టె

ఆరోగ్యానికి దివ్యౌషధం

20వ తేదీ నాటి స్నేహ సంచికలో అట్టమీది కథగా వచ్చిన ఆళ్లగడ్డ శిల్పులకు ప్రత్యేక ప్రశంసలు అందజేస్తున్నాము. 'విజ్ఞాన వీచిక'లో డోపింగ్ కథనంతో 'ఒలంపిక్స్ సైన్సు' ఆసక్తి దాయకంగా ఉంది. టూత్‌పిక్స్‌తో ఎంతో అందమైన కళాకృతులను మలచిన 'స్టీవెన్ జె బ్యాక్ మేన్'కు మా అభినందనలు. 'ఆరోగ్యం' శీర్షికలో నడక సంపూర్ణ ఆరోగ్యానికి పరమౌషధమని మాకవగతమైంది. ఆగ్రాకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఢిల్లీ రోడ్డు మీద విలసిల్లిన 'సికింద్రా'ను ప్రత్యక్షంగా చూసినట్లనిపించింది. కన్నవారి కలలను సాకారం చేస్తూ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పునరుద్ఘాటిస్తున్న మన అతిథి వై. ఆర్. హరగోపాల్ రెడ్డి గారి మనోగతంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాము. 'బాలనేస్తాలు'లో పిల్లి గురించి అనేక విషయాలు తెలుసుకున్నాం.

-నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం.

మరువలేని శిల్పకళా నైపుణ్యం

కవర్ స్టోరీ బాగుంది. కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ శిల్పుల పనితనం మరువలేనిదే. కళలన్నింటి లోనూ శిల్పకళ పురాతనమైనది, నైపుణ్యంతో కూడుకున్నది. సిపిఎం అగ్రనేత ప్రకాశ్‌కరత్ రచించిన 'జూనియర్ భాగస్వామి' అణు ఒప్పందం పుస్తకం చదివి చాలా విషయాలు తెలుసుకున్నాం. నేడు భారత ప్రజలందరు అణుఒప్పందం వలన కలిగే నష్టాలేమిటో ఈ పుస్తకం చదివి తెలుసుకోవాలి.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

తప్పక చదవాల్సిన పుస్తకం

20వ అట్టమీది కథలో 'అపర బ్రహ్మలు ఆళ్లగడ్డ శిల్పులు' అంటూ కర్నూలు జిల్లా విశిష్టతను చక్కగా వివరించారు. కటిక బండలైన రాతిని వెన్న ముద్దలా మార్చిన ఈ శిల్పకళాకారులు భారత దేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు రావడానికి కారణమైనారు. ఇదే వృత్తిలో ఆరు తరాలు గడిచినా పది తరాలు గడిచినా ప్రభుత్వం వీరిని గుర్తించలేదని, అటువైపునుంచి ఎటువంటి సహాయం రాలేదని వాపోయారు. తమ తండ్రిగారి పేరు నిలబెట్టాలంటున్న కళాకారుల మనోవాంఛ తీరాలని కోరుకుంటున్నాం. 'నడక చేసే మేలు నాలుగు విధాలు' అంటూ ఆరోగ్యం శీర్షికలో నడక మనకి దివ్య ఔషధంగా, వ్యాయామంగా పని చేస్తుందని, రక్తపోటు ఉన్న వారికి లాభదాయకంగా ఉంటుందనీ మధుమేహం, తగ్గిస్తుందనీ తెలిపారు. నడక నెంబర్ వన్ అని తెలుసుకున్నాం. నడక గురించి వివరించిన డాక్టర్‌గారికి నా హృదయపూర్వక వందనాలు. అగ్బరు పాదుషా సమాధి ఇక్కడ నిర్మించడమే 'సికింద్రా' ప్రత్యేకత అంటూ దాని రూపురేఖలను వర్ణిస్తూ చక్కని శైలిలో పూర్తి సమాచారాన్ని తెలియజేశారు. ఓ మంచి పుస్తకం 'అమెరికా వ్యూహంలో జూనియర్ భాగస్వామ్యం' అంటూ అణు ఒప్పందం గురించి పూర్తి విశ్లేషణను అందించారు. ప్రస్తుత వాతావరణంలో నిజంగా చదవవలసిన పుస్తకమిది. అనేక సమస్యల మీద 'మనసా తెలుసా'లో హిప్నో కమలాకర్ గారు ఇస్తున్న సమాధానాలు నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా వున్నాయి.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కృష్ణాజిల్లా.

రుచి బావుంది

ప్రపంచ ప్రసిద్ధి చెందిన యమబలిపుర శిల్పుల తదుపరి ఆళ్ళగడ్డ శిల్పం వన్నె తీరింది. కాని, రాతి బలము తక్కువంటారు. వీరు మహానైపుణ్యమైన శిల్పాలను



అందించేవారు, కానీ క్రమేణా వీరి సంఖ్య తగ్గిపోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వం వారిని ఆదుకోవాలి. కొత్తిమీర పచ్చడి అద్భుతంగా ఉంటుంది. మా జిల్లా వారు గ్రామీణ వ్యవస్థ నుండి యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్‌గా ఎదగడం అద్భుతం.

వాస్తురామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

ఆసక్తి దాయకం

ఆరోగ్యంలో వచ్చిన 'నాలుగు విధాల మేలు చేసే నడక' చదివి నడక ఎంత ఆరోగ్యమో తెలుసుకున్నాం. జానకి చావు కథ బావుంది. కవర్ స్టోరీ లో వచ్చిన అపర బ్రహ్మలు ఆళ్లగడ్డ శిల్పులు చూశాక వారి శిల్పకళా నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేము. విజ్ఞాన వీచికలో ఒలింపిక్స్- సైన్సు ఆసక్తి దాయకంగా ఉంది. ప్రకాష్ కరత్ జూనియర్ భాగస్వామి పుస్తక పరిచయం మాకు తెలియని చాలా విషయాలను తెలియజేసింది.

రాధిక, హైదరాబాద్.

ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పా హారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?

ఈ ఫొటో ఓ ప్రముఖ నటుడిది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.



అమ్మకుండా ఆపాలంటే...

మాది చిత్తూరు జిల్లాలోని పాకాల. మా కుటుంబం హైదరాబాదులో ఉంది. మా అమ్మానాన్నా స్వర్గస్తులైనారు. ఆస్తి మొత్తం మా అన్న ఒక్కడే అనుభవిస్తున్నాడు. ఇంత వరకు ఎటువంటి ఆదాయం ఇవ్వలేదు. మాకు రెండు వైపుల నుండి అంటే మా తండ్రి ఆస్తి, మేనత్త ఆస్తి వచ్చింది. మా తండ్రి ఆస్తి కన్నా మేనత్త ఆస్తి ఎక్కువగా ఉంది. ఇప్పుడు మా అన్న తండ్రి ఆస్తి మాత్రమే ఇస్తాను, మేనత్త ఆస్తి ఇవ్వను అంటున్నాడు. స్థిరాస్తి అమ్మే హక్కు మా అన్నకు లేదనుకుంటున్నాను. ఆస్తి అంతా నా ఆధీనంలోనే ఉంది. నన్ను ఏమీ చేయలేవని మా అన్న వాదిస్తున్నాడు. మేనత్త మంచి చెడ్డలు నేనే చూశాను. చనిపోయిన తర్వాత తలకొరివి నేనే పెట్టాను. మా ఇద్దరి మధ్య ఒప్పంద పత్రం ఉంది. ఇప్పుడు ఆస్తిని పంచుకునే వరకు స్థిరాస్తిని అమ్మే హక్కుకానీ, దానిమీద లోన్ తీసుకునే హక్కు కానీ ఉండకుండా చర్యలు తీసుకునే ప్రయత్నం చేయడానికి దారి చూపమని నా ప్రార్థన.

ఏసుబాబు, తిరుపతి.

మీ అత్తగారి ఆస్తి, మీ తండ్రిగారి ఆస్తికి మీరిరువురు వారసులు. కావున ఇరువురికి వాటా వుంటుంది. మీ ఇద్దరి మధ్య ఒప్పంద పత్రం కూడా ఉంది కావున మీరు కోర్టుకెళితేనే సమస్య పరిష్కరింప బడుతుంది. కాలం మాత్రమే ఎటువంటి మార్పు తీసుకురాదు, రాలేదు. న్యాయపరంగా మీరు ప్రక్రియ కొనసాగించవలసిందే. మీరు స్టాంపు డ్యూటీ కట్టే ఆర్థిక స్థోమత లేదంటే లీగల్ ఎయిడ్ ద్వారా న్యాయ సహాయాన్ని పొందవచ్చు.

న్యాయ ప్రక్రియ కాకుండా విధానాల ద్వారా అస్తిని పొందలేరు. మీరు కోర్టులో కేసు వేసిన రోజునే అమ్మకుండా, కొనకుండా ఇంజక్షన్ ఉత్తర్వులు పొందవచ్చు. స్టాంప్ డ్యూటీ కూడా ఎక్కువ చెల్లించవలసిన అవసరం మీకురాదు. పార్టీషయన్ కేసుకు 200 రూపాయలు కోర్టు ఫీజు కడితే చాలు.



జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

న్యాయం జరిగేనా!

నా పుట్టిన తేదీ 05-08-1964. నేను 1979 జూన్‌లో టెలికం డిపార్ట్‌మెంట్‌లో కాజువల్ మజ్దూర్‌గా చేరాను. అప్పుడు నా వయస్సు 15 సంవత్సరాలు. 1-12-1982లో పర్మినెంటు పోస్టు కోసం దరఖాస్తు పెట్టాను. అప్పట్లో రెండు సంవత్సరాలు కాజువల్‌గా చేస్తే రెగ్యులర్ పోస్టు ఇచ్చేవాళ్లు. ఆ క్రమంలో నేను దరఖాస్తు పెట్టాను. డిపార్టుమెంటు వారు నీ వయస్సు 15 సంవత్సరాలు కాబట్టి 18 సంవత్సరాలు పూర్తయిన వెంటనే దరఖాస్తు పెట్టుకోమని చెప్పారు. ఆ తర్వాత మారిన పరిస్థితుల వలన 10 సంవత్సరాలు కాజువల్‌గా చేసిన పిదప 1-4-1993న రెగ్యులర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. నాకు 1-12-1982న రెగ్యులర్ పోస్టు ఇవ్వాలని 2005వ సంవత్సరంలో హైకోర్టువారిని ఆశ్రయించాను. 16-11-2007న నాకు అనుకూలంగా సింగిల్ జడ్జిగారు తీర్పు చెప్పారు. జడ్జిగారు 15 సంవత్సరాలకి, 18 సంవత్సరాలకి వ్యత్యాసం ఏమీలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 23,39,14 ప్రకారం ఇద్దరూ సమానులేనని స్పష్టం చేశారు. 1-12-1982 నుండి రావలసిన బెనిఫిట్స్ ఇవ్వాలని తన తీర్పులో పేర్కొన్నారు. మా బి.ఎస్.ఎన్.ఎల్ వారు మళ్లీ ద్విసభ్య బెంచికి స్టే కోసమని పిటిషన్ వేయగా 31-3-08 న దానిని కూడా జస్టిస్‌గారు డిస్మిస్ చేశారు. ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళతారేమోనని అనుకుంటున్నాను.ఒక వేళ సుప్రీంకోర్టుకి గనుక వెళితే నాకు న్యాయం జరుగుతుందా! లేదా! చెప్పగలరు.

ఎస్. వెంకటేశ్వర్లు, విజయవాడ.

మీకు హైకోర్టులో తీర్పు రెండుసార్లు అనుకూలంగా వచ్చింది. కావున మీకనుకూలంగా వచ్చే అవకాశం ఉంటుంది. వారు సుప్రీంకోర్టుకు వెళతారని ఆందోళనగా ఉంటే మీరు సుప్రీంకోర్టులో కావిట్ పిటిషన్ ఫైల్ చేయవచ్చు. దాంతో వారు ఈ ఆర్డర్లను సస్పెండ్ చేయకుండా మీరు ముందు జాగ్రత్త చర్యగా చేపట్టవచ్చు. తద్వారా మీకు పరోక్షంగా ఎటువంటి ఆర్డర్లు అందవు.

కోతలు

అప్పు: మా ఇంట్లో రోజూ కాండిల్ లైట్ డిన్నర్లే తెలుసా?

డప్పు: ఏం మీ ఇంటికి కరెంటు లేదా ?



తెలివి

అప్పారావు: మీ అబ్బాయి గోళ్లు కొరకటం మానేశాడు ఏం చేశావేమిటి?

సుబ్బారావు: ఏం లేదు పళ్లూడగొట్టాను.

చూద్దామా...

యాజీవ్

అలనాటి వైభవాల ఆనవాలు

మైసూర్

ఏకశిలా నంది



బృందావన్ గార్డెన్

ప్రాచీన నగరాలలో పర్యటన జనసమ్మర్దమైన నగర హడావిడి నుండి ఆటవిడుపుగా ఉంటుంది. అటువంటిదే మైసూర్. వేల సంవత్సరాల చరిత్రతో పాటు పురాణ కథల నేపథ్యం కూడా ఉన్న మైసూర్ నగరాన్ని చూడవలసిన ప్రదేశాలలో ఒకటిగా చేశాయి. అందుకే ఈ వారం మనం ఆ నగరంలో పర్యటించి వద్దాం పదండి.

మహిషాసురుణ్ణి చాముం డేశ్వరి హతమార్చింది ఇక్కడేనని అంటుంటారు. దగ్గరలోనే ఈ ఘట్టానికి గుర్తు అన్నట్టు 'చాముండి హిల్' కూడా ఉంది. కాస్త దగ్గరి చరిత్రలో అంటే 1584లో చమరాజ వొడియార్ విజయనగర సామ్రాజ్యం నుండి వేరుపడి దీనిని రాజధానిగా చేశాడు. 1610లో రాజధానిని దగ్గరలోని శ్రీరంగపట్టణానికి మార్చాడు. 18వ శతాబ్దిలో హైదర్ అలీ అనే సైన్యాధికారి అధికారాన్ని కైంకర్యం చేసుకున్నాడు. అతని కుమారుడు టిప్పుసుల్తాన్ బ్రిటీష్‌వారితో పోరాడి ఒక యుద్ధంలో చనిపోయాడు. బ్రిటీష్ వాళ్లు తిరిగి రాజ్యాధికారాన్ని వొడయార్లకు కట్టబెట్టినా, వారిని తమ చేతిలో ఉంచుకున్నారు. వారి ఆధ్వర్యంలో మైసూరు మళ్లీ రాజధానిగా మారింది. స్వతంత్రం వచ్చిన తరువాత మైసూరు రాష్ట్ర రాజధానిని బెంగుళూరుకు మార్చారు. 1973లో రాష్ట్రం పేరుని కూడా కర్ణాటకగా మార్చారు. ఇన్ని మార్పులు, చేర్పులు జరిగినా, ఈ చారిత్రాత్మక ప్రదేశంలో ఇంకా ఆనాటి రాజరికపు ఆనవాళ్లు రాచమహళ్ల రూపంలో, ఆనాటి ఆచారాలు దసరా ఉత్సవాల రూపంలోనూ కనిపిస్తుంటాయి.

బెంగుళూరు నుండి మైసూరుకు 140 కిలోమీటర్లు. వీటి మధ్య బ్రహ్మాండమైన నాలుగుదారుల హైవే ఉన్నా విపరీతంగా స్పీడు బ్రేకర్లు, సెక్యూరిటీ చెక్‌లతో ప్రయాణం విసుగొస్తుంది. పేరొందిన టిప్పు ఎక్స్‌ప్రెస్ [illegible] రెండున్నర గంటల్లో



మైసూర్ మహారాజా ప్యాలెస్


బృందావన్ గార్డెన్ ముఖ ద్వారం

సెయింట్ ఫిలోమినా చర్చ్

అట్నుంచి ఇటూ, ఇట్నుంచి అటూ చేరుస్తుంది.

ఈ నగర పరిసరాల్లో దర్శనీయ స్థలాలు చాలానే ఉన్నాయి. వాటిల్లో బాగా ప్రసిద్ధమైనవి మైసూరు ప్యాలెస్, బృందావన్ గార్డెన్స్.

మైసూర్ ప్యాలెస్ 1911లో నిర్మితమైంది. కానీ అది 1897లో అగ్నిప్రమాదంలో ధ్వంసమైన పాత ప్యాలెస్ పునాదులపై పునర్నిర్మితమైంది. ఈ రాజభవంతిలో వొడయార్లు వాడిన దుస్తులు, ఆభరణాలు, జ్ఞాపికలు, చిత్రపటాల వంటి విస్తార సేకరణ ఉంది. ప్యాలెస్‌తో పాటు పర్యాటకులు మ్యూజియంను కూడా సందర్శించవచ్చు. ఇది ప్రస్తుతం ఒక మ్యూజియం. దీని నిర్మాణంలో జైపూర్, ఆగ్రా నుండి నిపుణులు వచ్చారని అంటారు. ఈ భవనం బయటనుండి ఎంత అద్భుతంగా ఉంటుందో అంతకు రెట్టింపు అద్భుతం లోపల కనిపిస్తుంది. అడుగడుగునా రాజరికం ఉట్టిపడే నిర్మాణం, అలంకరణ, అమరిక మనల్ని పాతకాలానికి తీసుకుపోతాయి. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాల్లో ఈ ప్యాలెస్‌ని 100,000 విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరిస్తారు.

భారతదేశ మణిపూస మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్మాణం రూపుదిద్దుకుంది. కృష్ణరాజసాగర్ డామ్‌కు మరోవైపున ఉన్న బృందావన్ గార్డెన్స్ మైసూర్ వెళ్లిన ప్రతివారూ దర్శించవలసిన స్థలమే. విశ్వేశ్వరయ్య ఈ డామ్‌కి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. కావేరీ నదిమీద కట్టిన ఈ డ్యామ్‌కి, అప్పటి మైసూర్ రాజ్య పాలకుడైన కృష్ణరాజ వొడయార్ పేరు పెట్టబడింది. బృందావన్‌గార్డెన్‌లో అందమైన మ్యూజికల్ ఫౌంటెన్లున్నాయి. చాముండి హిల్స్ చాముండేశ్వరీ దేవి పేరున ఉన్న కొండ, దాదాపు వెయ్యి మెట్లున్న ఈ కొండపైకి ఎక్కడం కాస్త శ్రమే. మధ్యలో శివుని వాహనమైన నంది ఏకశిలా విగ్రహం ఉంది. కొండపైన చాముండీ దేవాలయం, మహిషాసుర విగ్రహం, ఇంకా కొన్ని గుడులు ఉన్నాయి. చాముండి కొండ సముద్ర మట్టానికి 800 అడుగుల ఎత్తులో ఉంది. దీనిపై అటవీ సంపద, వన్య ప్రాణులు అధికం.

మైసూర్‌లో మరో రాజమహల్ జగ్మోహన్ ప్యాలెస్. ప్రస్తుతం ఇది కళాఖండాల ప్రదర్శన శాల. అలాగే లలిత్‌మహల్ అనే మరో ప్యాలెస్ ప్రస్తుతం ఒక హోటల్. దేశంలోనే అతిపెద్ద చర్చిలలో ఒకటైన సెయింట్ ఫిలోమినా చర్చి అద్భుతమైన కట్టడం.

అతి ప్రాచీనమైన జంతుప్రదర్శనశాల కూడా ఇక్కడ ఉంది. 1892లో ప్రారంభించిన మైసూర్ జూ ఇప్పటికీ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

మైసూర్ అనగానే చందనం, పట్టు గుర్తుకు రావడం ఖాయం. మైసూర్ పర్యటనకు వెళ్లినపుడు చందనంతో చెక్కిన వస్తువులు, పట్టువస్త్రాలు జ్ఞాపికలుగా తెచ్చుకుంటారు.

అలనాటి వైభవాల ఆనవాళ్లని ఈనాటికీ చూపే మైసూర్‌ని తప్పక చూడాల్సిందే. ❄


జూ పార్కు ముఖద్వారం


చాముండేశ్వరి ఆలయం


మ్యూజిక్ వాటర్ ఫౌంటెన్

మరీ ముఖ్యంగా ఇటీవలి కొన్ని సంవత్సరాలలో బుద్ధి జీవుల భావ స్పందనలో నాన్న స్థానం బలపడింది. నాన్నల స్వరూప స్వభావాలలోనూ వచ్చిన మార్పు ఇందుకు దోహదపడింది. దీనిలో ఫెమినిజానికి ప్రతిస్పందన లక్షణమూ వుంది. మొత్తం మీద ఇలాంటి కవితలన్నిటినీ కలగలపి అన్వర్ 'నాయిన' పేరుతో సంకలనం తీసుకొచ్చారు. 800 పైగా కవితలు సేకరించి ఇందులో 200 పైచిలుకు సంకలనంలో పొందుపర్చారు.



నాయిన కవితారాధన

మనోజ్ఞ మానవ సంబంధాలలో దేని ప్రత్యేకత దానికే వుంటుంది. అన్నిటిలోకి అత్యున్నతమైనవి అమ్మనాన్నలతో అనుబంధం. అమ్మ అంటే అందరికీ అభిమానం. లేదా సెంటిమెంటు. అమ్మ గురించి బోలెడు పాటలు, కవితలు, కథలు. అమ్మ కన్నా భౌతిక వాస్తవం మరొకటి లేదు గనక దాన్ని భావుకతగా కాక వాస్తవికతగా చూడటమే సరైంది. అందరికీ ఆరంభ వాచకం అమ్మే. అయితే కుటుంబ యజమానిగా, సంపాదించి దాన్ని నడిపించే వ్యక్తిగా నాన్న ఒక విధంగా సమాజపరంగా ప్రథమ స్థానంలోనే వుంటాడు. నాన్న ప్రేమాస్పద శిక్షణ, మార్గదర్శకత్వం భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహిస్తాయి. అదే సమయంలో నాన్న అంటే ఒక దూరం, ఒక భయం కూడా వెన్నాడటం కద్దు. పిల్లల భావ ప్రపంచంలో సాధారణంగా తొలి హీరోలు నాన్నలే. తర్వాత అన్నయ్యలు, బాబాయిలు, మామయ్యలు.. ఆ పైన మాష్టార్లు, ఇంకా పెద్దయ్యాక స్నేహితులూ, సన్నిహితులూ .

మొదటే చెప్పుకున్న నేపథ్యంలో తల్లి గురించి వున్నన్ని కవితలూ కథలూ నాన్న గురించి లేకపోవడానికి బలమైన కారణాలే వున్నాయి. అయితే అవి తక్కువేమీ కాదు. మరీ ముఖ్యంగా ఇటీవలి కొన్ని సంవత్సరాలలో బుద్ధి జీవుల భావ స్పందనలో నాన్న స్థానం బలపడింది. నాన్నల స్వరూప స్వభావాలలోనూ వచ్చిన మార్పు ఇందుకు దోహదపడింది. దీనిలో ఫెమినిజానికి ప్రతిస్పందన లక్షణమూ వుంది. మొత్తం మీద ఇలాంటి కవితలన్నిటినీ కలగలపి అన్వర్ 'నాయిన' పేరుతో సంకలనం తీసుకొచ్చారు. 800 పైగా కవితలు సేకరించి ఇందులో 200 పైచిలుకు సంకలనంలో పొందుపర్చారు.

రకరకాల సామాజిక నేపథ్యాలు గల వారు తమ నాన్నలను గుర్తు చేసుకుంటూ రాసిన కవితలు కదిలిస్తాయి. కష్టజీవులను కళ్లముందు నిలుపుతాయి. **"కోడి మా నాయన్ను నిద్రలేపేదో/ మా నాయనే కోడిని నిద్రలేపేవాడో/ తెలియదు గాని/ సూర్యుణ్ణి లేపేది మాత్రం మా నాయనే'** అంటూ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఆయన శ్రమైక జీవితానికి అంజలి ఘటిస్తాడు. **' పండగైనా పబ్బమైనా/ పంట చేనుకు కావలుంటివి/ గొడ్లమేపి రాత్రి వరకు/ దొడ్డిలోనికి తోలుకొస్తివి/గాఢ నిద్రలో నేను వుండగ/ ఇంటికొస్తివి నాయనో! కోడి కూతకు ముందు లేసి- చేనుకెళ్తివి నాయనో"** అని మందాడి సత్యనారాయణ రెడ్డి పాటతో పాదాలు కడుగుతాడు. **"కరిగే పాషాణం కదలాడినట్టుంటాడు/ చలించే ఇనుములాగా తిరుగాడుతుంటాడు / దేహం లోవెల వెలుపలా గంభీరత్వం ప్రవహిస్తున్నా/అనునిత్యం దహించుకుపోతుంటాడు"** అని వేణూ సంకోజు నాటి నాన్నల రూపాన్ని గుర్తు చేస్తాడు. '

'నాయన భుజం మీద కూర్చున్న నాడే/ అందరి కంటే ఎత్తు పెరిగిన అనుభూతి / కొత్తలోకంలోకి తొంగి చూసేందుకు / చూపుడు వేలి స్పర్శ' అంటూ అన్నవరం దేవేందర్ ప్రతివారికీ బాల్యంలోనూ తప్పక కలిగే పసిభావాన్ని ప్రతిబింబిస్తాడు. 'నాన్న గురువే కాదు- అమ్మ కూడా/ నాన్న స్నేహితుడు / నాన్న వికసించిన పువ్వు/విరబూసిన నవ్వు" అంటూ ముగిస్తాడు.'నాన్నా! నీవొక మాటలకందని మహాశబ్దానివి" అంటున్న కలవకుంట రామకృష్ణ కూడా ఇంచుమించు అదే భావాన్ని స్ఫురింపచేస్తాడు. "... పొద్దంతా ఏం చేస్తాడో ఎక్కడ తిరుగుతాడో / ఎవరితో ఏం పని వుంటుందో తెలియదు / ఇంటికి ఓ పండ్ల గంపలా వస్తాడు / ఓ ధైర్యంలా ఓ నమ్మకంలా వస్తాడు / నాయన ఇంట్లో వుంటే వెయ్యేనుగల బలం / ...... నాయన లేనప్పుడు ఇళ్లు పక్షులెగిరిపోయిన

తెర

చెట్టౌతుంది" అన్న ఐలేని గిరి కవిత కుటుంబ జీవితంలో నాన్న స్థానమేమిటో కూడా తెలుపుతుంది. " నాన్నా నీకు శతకోటి వందనాలు/ సాగు చేసిన పొలానివైనందుకు/ అజ్ఞానం పెన్సిలు చెక్కిన కత్తివైనందుకు/ నన్ను మనిషిని చేసినందుకు/ ప్రపంచాన్ని తెచ్చి నా దోసిట్లో పోసినందుకు... అంటూ మాధవి సనారా ఆయన మార్తదర్శకత్వానికి వందనం చేస్తారు.

ఈ సంకలనంలో ఎందరెందరో ప్రసిద్ధులు వాళ్ల నాన్నల గురించి అక్షరీకరించిన అనుబంధాల ఆనవాళ్లున్నాయి. ఆ పేర్లజాబితా ఇవ్వాలంటే చాలా పెద్దదవుతుంది. గతంలో కొందరు ప్రముఖులు నాన్న గురించి రాసిన కవితలు కూడా జత చేశారు. అలాగే నాన్నలు కన్నుమూశాక ఆ దుఃఖాతిరేకంతో కార్చిన కన్నీటి కవితలూ వున్నాయి. ఆయన ఔన్నత్యం ముందుగా గుర్తించలేకపోయామన్న పశ్చాత్తాపాలూ వున్నాయి. " నాన్న ఒక బంధం ,బాధ్యత, అర్థం పరమార్థం నాన్న ఒక చేయూత ఒక విధాత ఒక మహావృక్షం అంటున్న దోర్నాదుల సుబ్బమ్మ కవిత నుంచి బాధ్యత లేని కొంవరు నాన్నలను నిశితంగా విమర్శించే ఒకటి రెండు కవితల వరకూ ఇందులో వున్నాయి. ఆ విధంగా ఇది వైవిధ్య భరితమైన సంకలనం.

165 వ పేజీలో వున్నా **'తొలి నమస్కారము తండ్రికి'** అన్న అరుణ్ సాగర్ కవిత బహుశా దీనికి మకుటంగా వుండదగింది **'తండ్రీ నిను దలంచి.. నాన్నా నేను నీ తొలూకూ జన్యుకణ విశేషాన్ని, నీ కొనసాగింపుని... ప్రపంచంలో నువు చేసిన సంతకాన్ని.."** అంటూ మొదలెట్టాడు. **'..కథలూ గాధలూ కావ్యాలూ కమనీయ సామెతలూ పోలికలూ అన్నీ నీవే కదా..నాన్నకీ కొన్ని వుంచనీ. నన్నిపుడు నాన్న కోసం కూడా ఒక మొక్క నాటనీ'** అంటూ ముగిస్తాడు. బహుశా ఇలాంటి భావనే ఈ కవితా సంకలనానికి ప్రేరణ అయివుండొచ్చు. కాని జన్మ కారకుల మధ్య జగడం పెట్టకుండానే వుభయులనూ గౌరవించవచ్చు. పైగా అమ్మనూ నాన్ననూ కూడా వృద్ధాశ్రమాల పాలు చేస్తున్న నేటి కాలంలో ఇలాంటి సంకలనాలు ఆహ్వానించదగ్గవి. వరంగల్ సృజనలోకం 2006 జనవరిలో ప్రచురించిన 500 పేజీల ఈ సంకలనానికి గౌరవ సంపాదకులు రామాచంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాసరావు, లంకా శివరామప్రసాద్‌లు. సంపాదకుడు అన్వర్.

నాయినా కవితా సంకలనం, సంపాదకుడు: అన్వర్
సృజన లోకం (రైటర్స్ కార్నర్) వెల: **150/-**,
పేజీలు: **506**, ప్రతులకు: సృజనలోకం,
అన్ని పుస్తక షాపులు.

❄

సాంబారు

కావలసిన పదార్థాలు

పప్పు- ఒక కప్పు, చింతపండు- నిమ్మకాయంత, ఆవాలు- స్పూను, పెసరపప్పు- చిన్న గరిటెడు, ఎండుమిర్చి-5, కొబ్బరి (పచ్చిది)- చిన్న చిప్ప, సెనగపప్పు- చిన్న గరిట, ఇంకా ఒక చిన్న దోసకాయ, రెండు ములక్కాయలు, నాలుగు ఉల్లిపాయలు- రెండు బెండకాయలు, రెండు టొమేటో పండ్లు, పచ్చిమిర్చి -4, కరివేపాకు, పోపు సామాను.

తయారు చేసేవిధానం

కందిపప్పు మెత్తగా ఉడికించి పక్కన పెట్టుకోవాలి. తరువాత పెసరపప్పు, సెనగపప్పు, ధనియాలు, ఆవాలు వేయించుకోవాలి. వీటితో కొబ్బరి కలిపి మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి. పైన చెప్పిన కాయలన్నీ ముక్కలుగా కోసుకోవాలి (దోసకాయ చక్రాల్లాగా కోసుకుంటే చాలు పెచ్చు తీయక్కర్లేదు). చింతపండు పులుసు, ఈ ముక్కలు, నూరిన ముద్ద కలిపి స్టౌ మీద పెట్టాలి. ఉప్పు కూడా వేయాలి. పొంగొచ్చిన తరువాత పప్పు కలిపి మిరియం గింజంత ఇంగువ వేయాలి. మెత్తగా నూరి పోపులో వేసి కలపాలి. దింపేటప్పుడు కాస్త కొత్తిమీర ఇష్టం ఉంటే వేసుకోవచ్చు.



కరివేపాకు కారం

కావలసిన పదార్థాలు

కరివేపాకు రెబ్బలు- 2 గుప్పెళ్ళు
ఎండుమిర్చి- 1 గుప్పెడు,
ధనియాలు- 1 గుప్పెడు, చింతపండు- చిన్న నిమ్మకాయంత
జీలకర్ర- 1 టీ స్పూను,ఎండుమిర్చి- 1 గుప్పెడు, వెల్లిపాయలు- 10 గర్భాలు, నూనె- 1 టీ స్పూను,
ఉప్పు- తగినంత

తయారు చేసేవిధానం

ముందు కరివేపాకు విడదీసి శుభ్రంగా కడిగి తడి తుడిచి పక్కన పెట్టుకోవాలి. బాండీలో ధనియాలు, జీలకర్ర వేసి దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత నూనెవేసి మిరపకాయలు వేయించి తీసుకోవాలి. అలాగే కరివేపాకు వేయించి పెట్టుకోవాలి. వెల్లుల్లిపాయలు, చింతపండు, సరిపడా ఉప్పు వేసి వేయించాలి. పక్కన పెట్టుకున్న వన్నీ కూడా వేసి మెత్తగా దంచి సీసాలో పోయాలి. కరివేపాకు కారం రెడీ. వాన పడినప్పుడు వేడి వేడి అన్నంలో కరివేపాకు కారం, కొద్దిగా నెయ్యి జోడించి తింటే సూపర్‌గుంటుంది.

పెరుగు చక్రాలు

కావలసిన పదార్థాలు

పెరుగు- 2 కప్పులు
బియ్యంపిండి- 4 కప్పులు
కారం- తగినంత, ఉప్పు- తగినంత
తినే సోడా-కొంచెం

తయారు చేసేవిధానం

ఒక గిన్నెలో బియ్యం పిండి, పెరుగు, ఉప్పు, కారం, కొద్దిగా సోడా కలిపి 10 నిమిషాలు నానబెట్టాలి. తరువాత ఒక బాండీలో నూనె పోసి బాగా వేడి చేయాలి. కలిపిన పిండిని చక్రాల గిద్దలలో నింపాలి. తరువాత కాగుతున్న నూనెలో చక్రాలు వేయాలి. చక్రాలు ముదురు గోధుమ రంగు వచ్చే వరకు వేగనీయాలి. వేగిన చక్రాలను గాలి చొరబడని డబ్బాలో వేసి పెట్టుకుంటే తినేటప్పుడు కరకరలాడుతూ బావుంటాయి.



వేడివేడిగా సేమ్యా పాయసం

కావలసిన పదార్థాలు

సేమ్యా- 25 గ్రాములు, పాలు- 1 కప్పు
నీళ్ళు - 1 కప్పు, నెయ్యి - ఒక స్పూన్
పంచదార- 50 గ్రాములు
మిఠాయిరంగు- చిటికెడు
యాలకులు-3, జీడిపప్పు-5, కిస్‌మిస్-5

తయారు చేసేవిధానం

సేమ్యాని నేతిలో గోధుమరంగు వచ్చే వరకు వేయించాలి. ఒక పాత్రలో నీళ్ళుపోసి బాగా మరగబెట్టాలి. ఈ మరుగుతున్న నీళ్లలో సేమ్యా పోసి బాగా వుడికించాలి. అప్పుడు పాలు, పంచదార వేసి మరగబెట్టవచ్చు. పాలల్లో మిఠాయిరంగు రంగరించి పాయసంలో వెయ్యాలి. వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్, యాలకులు పొడి వేసి దింపాలి. వేడిగా తాగితే రుచిగా వుంటుంది.

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

అమెరికన్ దేగ

మిన్నికాంజు

(64వ భాగం)

జరిగిన కథ:

అయితే సాన్ కార్లోస్, జిల్లా నదుల సంగమ స్థానంలో ఉన్న ఈ ఏజెన్సీ కొందరు సైనికాధికారులకు నచ్చలేదు. "నది మట్టం నుండి ముప్పై అడుగుల ఎత్తులో ఉంటుందిది. చిన్న చిన్న బిల్డింగులు తప్ప మరేమీ లేవిక్కడ. ఎటుచూసినా మొక్కలు పెరగని బంజరుభూమి దర్శనమిస్తుంది. కాలువలు, నీళ్ల చలములు లేవు. వర్షం పడదు. బీటలు వారిన నేలమీద ఎప్పుడూ దుమ్ము పరచుకుని ఉంటుంది. వేసవిలో ఇక్కడ ఉష్ణోగ్రత 110 డిగ్రీల కన్నా ఎక్కువే. దోమలు, మిడతలు, ఇతర కీటకాలు(కొన్ని మిలియన్లలో) మన వునికిని నరకం చేస్తాయి" అంటూ యింటికి ఉత్తరం రాసుకున్నాడొక ఆఫీసర్.

1876, మే 3 నాడు కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫైర్స్ నుండి క్లమ్‌కి ఒక టెలిగ్రామ్ వచ్చింది. తక్షణమే చిరికాహువా రిజర్వేషన్ కెళ్లి, జెఫోర్డ్‌ను సస్పెండ్ చేసి ఇండియన్లను సాన్ కార్లోస్‌ను తీసుకురమ్మని ఆదేశం. శాంతిప్రియులైన చిరికాహువాలను బాధపెట్టడం క్లమ్‌కిష్టంలేదు. వైట్ మౌంటెన్ రిజర్వేషన్ జీవితాంతం వాళ్లకు నచ్చదని కూడా తెలుసు. అశ్విక దళాన్ని ఈ విషయంలో కలుగచేసుకోవద్దని ఆజ్ఞాపించి, ఇండియన్ పోలీసులతో అపాచీపాస్‌కెళ్లి చిరికాహువాలకు ఈ దుర్వార్త చేరవేశాడు. అతనిపట్ల ఉన్న గౌరవంతో కాబోలు, జెఫోర్డ్స్, టాజా అన్ని ప్రతిపాదనలకూ అంగీకరించారు. టాజాది కూడా అతని తండ్రి స్వభావమే. తెగవాళ్లంతా సుఖశాంతులతో బ్రతికితే చాలు, ఏ రిజర్వేషన్‌లో ఉన్నా ఇబ్బంది లేదన్నాడు. అయితే, ఆ తర్వాత కాలంలో సగం మంది చిరికాహువాలు మాత్రమే సాన్ కార్లోస్ చేరుకున్నారు. రిజర్వేషన్‌ను తమ ఆధీనంలోకి వచ్చిన సైనికులను చూసి మిగతా వాళ్లు మెక్సికో సరిహద్దుదాటి పారిపోయారు. అందులో ఒకడు నలభై ఆరేళ్ల బెడంకోహె అపాచీ. ఇతడు యవ్వనంలో మంగాస్ కొలరాడోతో, ఆ తర్వాత కాచైస్ తో కలసి పోరాడటమే కాక తనను తాను చిరికాహువాగా ప్రకటించుకున్నాడు. ఇండియన్లలో 'గోయాత్లే' గానూ, అమెరికన్లలో 'జెరోనిమో' గానూ సుప్రసిద్ధుడు.

కొత్తగా సాన్‌కార్లోస్ చేరుకున్న చిరికాహువాలకు క్లమ్ అంటే పెద్దగా ఇష్టంలేదుగానీ, అతనికేమీ సమస్యలు సృష్టించలేదు. 1876లో, ఇండియన్ బ్యూరో అనుమతితో 22 మంది అపాచీలను తూర్పు రాష్ట్రాల యాత్రకు తీసుకెళ్లాడు. ప్రయాణం సాఫీగానే సాగింది గానీ, వెంట వచ్చిన టాజా న్యుమోనియాతో హఠాత్తుగా మరణించాడు. అందరి అంగీకారంతో అతణ్ణి అక్కడే కాంగ్రెషనల్ సిమెట్రీలో ఖననం చేశారు. అయితే బృందం తిరిగి వచ్చిన తర్వాత, టాజా తమ్ముడు నైంగె, టాజా మరణానికి క్లమ్ బాధ్యుడని నిందించాడు. "మా అన్నకు ఏ జబ్బూ లేదు. ఆరోగ్యంగా ఉన్నవాణ్ణి తీసికెళ్లి చంపేశావు. జబ్బుపడిన మనుషులకెవరూ చికిత్సే చెయ్యరా అక్కడ?"

జరిగిన సంగతేమిటో ఎస్కిమింజిన్‌ను స్వయంగా వివరించమన్నాడు క్లమ్. అయినా చిరికాహువాల అనుమానం తొలగలేదు. ఇప్పుడు వాళ్లకు సలహాలివ్వడానికి టగ్గిలో జెఫోర్డ్ కూడా దగ్గరలేడు. జాన్ క్లమ్ మీద, ఆ లెక్కన తెల్లవాళ్ల మంచితనం మీదే నమ్మకం సడలుతున్నది.

1876-77లలో చిరికాహువాల బంధువులు మెక్సికోనుండి తరచుగా రిజర్వేషన్‌కు రావడం ప్రారంభమైంది. సరిహద్దుకు ఆవల, జెరోనిమో, తన శత్రువులైన మెక్సికన్ల నుండి పశువులు, గుర్రాలు పెద్ద సంఖ్యలో దొంగిలించి లాక్కుని న్యూమెక్సికోలో వుంటున్న రాంచర్లకు అమ్ముతున్నాడని తెలిసింది. ఆడబ్బుతో ఆయుధాలు, హాట్లు, బూట్లు, విస్కీ కొని ఒక సైన్యాన్ని కూడా ఏర్పరచుకున్నాడతడు. ఆ తర్వాత ఈ చిరకాహువాలు క్రమంగా ఆహో కాలిమెంట్ ఏజెన్సీకి వచ్చి (ఇక్కడి నాయకుడు విక్టోరియో) తమ మించ్రె సోదరుల వద్ద స్థిరపడ్డారు.

అపాచీ పోలీసులను, ఆహో కాలిమెంట్‌కు తీసుకెళ్లి, వాళ్ల సాయంతో ఇండియన్లను సాన్ కార్లోస్‌కు తరలించమని 1877లో జాన్ క్లమ్‌ను ఆదేశించింది వాషింగ్టన్. అంతేకాదు. ప్రభుత్వానికి ప్రధాన శత్రువుగా పరిణమించిన జెరోనిమోను ఇతర చిరకాహువాలను అరెస్టు చెయ్యాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆనాటి పరిణామాల గురించి జెరోనిమో వాంగ్మూలమిచ్చాడు.

"సాన్‌కార్లోస్ నుండి రెండు కంపెనీల సైనికులు మా కోసం వచ్చారు. మొదట నాతో, విక్టోరియోతో మాట్లాడతామన్నారు. ఏ విషయం గురించి చర్చించదలచుకున్నారో తెలియదు. కాని మాతో 'ఫ్రెండ్లీ'గానే ప్రవర్తించారు. బహుశా తెగవాళ్లతో సమావేశం ఏర్పాటు చెయ్యాలనుకుంటున్నారేమో! మేం అక్కడికి వెళ్లగానే సైనికులు మమ్మల్ని చుట్టుముట్టి మా ఆయుధాలు లాక్కున్నారు. ఆ తర్వాత కోర్ట్ మార్షల్‌లో విచారించారు. కొన్ని ప్రశ్నల తర్వాత విక్టోరియోను వదిలి నన్ను జైలుకు పంపారు. కాళ్లకూ, చేతులకూ సంకెళ్ళు వేసి జంతువులాగా నడిపించాడు. నేను చేసిన నేరమేమిటని అడిగాను. అపాచీపాస్‌ను వదిలి వెళ్లటమంటే

చట్టాన్ని వుల్లంఘించటమేనట!

"కాని అపాచీ పాస్‌తో మాకు సంబంధంలేదు. అక్కడి సైనికులు మా తెగవాళ్లు కారా! ఎక్కడికి వెళ్ళాలన్నా వాళ్ళ అనుమతి తీసుకోవాలా? ఇదేం వింత ఆచారం? నాలుగు నెలల పాటు బందీగా వున్నాను. ఆ కాలంలోనే నన్ను పాన్ కార్లోస్‌కు తరలించారు. ఆ తర్వాత నన్ను కోర్టులో హాజరు పరచకుండానే నా మీద మరో విచారాణ జరిపారు. ఏమైందోగాని, ఆ తర్వాత నన్ను విడుదల చేశారు".

విక్టోరియోను అరెస్టు చెయ్యలేదు గాని, అతణ్ణీ ఇతర వార్మ్ స్ప్రింగ్స్ (ఒక ప్రాంత) అపాచీలనూ, 1877లో సాన్ కార్లోస్‌కు బదలాయించారు. విక్టోరియా విశ్వాసం పొందటానికి క్లమ్ చాలా ప్రయత్నించాడు. ఆహో కాలిమెంట్ నిర్వహణ బాధ్యత అతనికే అప్పగించాడు. ఏ గొడవలూ లేక ఏజెన్సీ కొన్నాళ్ళు ప్రశాంతంగానే వుంది. వైట్ మౌంటెన్ ప్రాంతంలో అపాచీలకు శాశ్వత నివాసస్థానం కల్పించాలని కూడా అనుకున్నారు అధికారులు. అంతలో సైనికుల కంపెనీ ఒకటి హఠాత్తుగా జిలా రివర్ (ఫోర్ట్ థామస్)కు వచ్చింది. అక్కడ తుంటరి ఇండియన్లు కొందరు వున్నారు గనక, అధికారులకు అదనపు భద్రత కల్పించటం కోసం అని వివరణ ఇచ్చింది ప్రభుత్వం.

తనను సంప్రదించకుండానే సైన్యాన్ని పంపినందుకు కోపంతో వూగిపోయాడు క్లమ్. తెల్లసైనికులకు బదులుగా, అపాచీ పోలీసులతో శాంతిభద్రతలు కాపాడతానని కమిషనర్ ఆఫ్ ఇండియన్ అఫెయిర్స్‌కు ఓ టెలిగ్రాం పంపాడు. అసలు మిలిట్రీ ఇక్కడికి రావలసిన అవసరమే లేదని కూడా స్పష్టం చేశాడు. వాషింగ్టన్‌ను ఎదిరించిన క్లమ్ నిర్ణయాన్ని పతాక శీర్షికగా ప్రచురించాయి అక్కడి పత్రికలు. వార్ డిపార్ట్‌మెంట్‌లో కూడా ఇది చర్చనీయాంశమైంది. అరిజోనా, న్యూమెక్సికోలలో ఆర్మీ కాంట్రాక్టు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తమ వ్యాపారం దెబ్బతింటుందనే భయంతో క్లమ్‌ని కుర్ర చేష్టలంటూ ఎద్దేవా చేశారు. "వేలాది సాయుధ సైనికులు చెయ్యలేని పని, ఈ ఇరవై ఆరేళ్ళ కుర్రకుంక చేస్తాడా? అపాచీలు తిరుగుబాటు ప్రకటించిన రోజు నుండీ సైన్యమేగదా వాళ్లను నియంత్రించగలిగింది. సాన్‌కార్లోస్‌కు మరిన్ని బలగాలు వచ్చాయి. నిరసనగా జాన్‌క్లమ్ తన వుద్యోగానికి రాజీనామా చేశాడు. అయితే ఎంత సానుభూతి వున్నా అతడు 'అపాచీ' కాదు. టాం జెఫోర్డ్స్‌లాగ వాళ్లతో మమేకమై పోలేదు. ఆత్మహత్యా సదృశమైన యుద్ధాలు ఇండియన్లు ఎందుకు చేస్తారో అతనికర్థం కాదు. ఆత్మగౌరవం కోసం, వారసత్వాన్ని పరిరక్షించుకోవటం కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన వాళ్ళను 'హీరోలు'గా చూడలేదు. అతడి దృష్టిలో, జెరోనిమో, విక్టోరియో, నానా, లాకో, నైషో, ఇతర వీరులు చట్టాన్ని అతిక్రమించిన నేరస్తులు. దొంగలు, హంతకులు, తాగుబోతులు. తెల్లవాళ్ళ ప్రగతి మార్గాన్ని అనుసరించలేని మూర్ఖులు. ఎక్కడో లోపల వాళ్లపట్ల చులకన భావం కూడా లేకపోలేదు. ఆ తర్వాత కొద్దికాలానికే అపాచీలను వదిలి, అరిజోనాలోని టూంబ్‌స్టోన్‌లో స్థిరపడ్డాడు క్లమ్. మత ప్రచారం మీద మక్కువతో 'ఎపిటా' అని ఒక వార్తా ప్రతిక కూడా ప్రారంభమైంది.

1877 నాటికి సాన్ కార్లోస్‌లో పరిస్థితులు అదుపు తప్పాయి. అక్కడికొచ్చిన ఇండియన్ల సంఖ్య పెరిగింది. కాని (అనేక వందలు దాటింది) తదనుగుణంగా ఆహారం సరఫరా చెయ్యలేదు అధికారులు. దీనికి తోడుగా, ఏజెంట్ కొన్ని కొత్తరూపాల్ని ప్రకటించాడు. రేషన్లు ఎక్కడివక్కడ పంపిణీ చెయ్యటానికి బదులు, అందరూ ఒక చోటకి వచ్చి తీసుకుపోవాలని ఆదేశించాడు. ఇందుకోసం దూరంగా వున్న వాళ్ళు, ఇరవై మైళ్ళదాకా నడవాల్సిన అవసరం వచ్చింది. ఫలితంగా రాలేని వృద్ధులకూ, పిల్లలకూ ఆహారం దొరకలేదు. దీనికితోడు, గనుల తవ్వకానికి వచ్చిన మైనర్లు, రిజర్వేషన్‌లో కూడా వాళ్లను ప్రశాంతంగా బతకనివ్వలేదు. క్లమ్ ప్రారంభించిన 'అపాచీ పోలీస్' నిరర్థకంగా మిగిలిపోయింది.

సెప్టెంబర్2 నాటి రాత్రి తన వార్మ్‌స్ప్రింగ్ అనుచరులను తీసుకొని 'ఆహో కాలిమెంట్'కు వెళ్ళిపోయాడు విక్టోరియో. పోలీసులు వాళ్ళ గుర్రాల్నీ, కంచరగాడిదల్నీ తిరిగి రిజర్వేషన్‌కు తీసుకొచ్చారు గాని మనుషుల్ని మాత్రం వదిలేశారు. దారిలో రాంచర్లతో, సైనికులతో అనేక ఘర్షణల తర్వాత విక్టోరియో, ఆహో కాలిమెంట్ చేరుకోగలిగాడు. ఓ ఏడాది పాటు అతణ్ణి అక్కడ వుండనిచ్చిన ఫోర్ట్ లింగేట్ సైనికులు, 1878లో పలాయితులందరూ సాన్ కార్లోస్‌కు తిరిగి రావాలని ఆదేశించారు.

ఆహో కాలిమెంట్ అపాచీల మాతృదేశం, తమనక్కడే వుండనిమ్మని సైనికులు అర్థించారు. విక్టోరియో చివరకు, విసిగి "మీరు బలవంతంగా మా స్త్రీలనూ, పిల్లన్నీ వ్యాగన్లలో తీసుకెళ్లగలరు. కాని పురుషులం మాత్రం చచ్చినా ఇక్కడి నుండి కదలం" అంటూ మొండికేశారు.

ఆ తర్వాత కొద్దిరోజులకే, విక్టోరియో, మరో ఎనభై మందీ మింబ్రెస్ పర్వతాల్లోకి పారిపోయారు. శీతాకాలంలో గడ్డు పరిస్థితి ఏర్పడింది. 1878 ఫిబ్రవరిలో కొందరు సైనిక కేంద్రం దాకా వచ్చి లొంగిపోతామన్నారు. ఒంటరిగా ఎంతకాలం బతకగలరు? సాన్ కార్లోస్ నుండి తమ కుటుంబాలను కూడా పిలిపిస్తే అందరూ కలిసి వుంటారు. చాలాకాలం, సైనికులు, ఏ నిర్ణయమూ తీసుకోలేదు. అపాచీలు అనేకసార్లు వేడుకున్న తర్వాత, న్యూమెక్సికోలో స్థిరపడమని ఆదేశించారు. కాకపోతే అక్కడవాళ్లు, టూలారోసా వద్ద మెస్కోలెరో తెగ వాళ్లతో కలిసి సహజీవనం చెయ్యాలి. అన్ని షరతులకూ అంగీకరించాడు విక్టోరియో. అలా, రెండేళ్లలో మూడుసార్లు తన నివాస స్థలాలు మార్చారు వార్మ్‌స్ప్రింగ్స్ అపాచీలు.

1879లో, పాత నేరం ఒకటి తిరగదోడింది సైన్యం (గుర్రాల దొంగనతమూ, ఒక హత్యా). పోలీసులు అరెస్టు చేయటానికి

వచ్చినప్పుడు విక్టోరియో తృటిలో తప్పించుకున్నాడు. తెల్లవాళ్ళ రిజర్వేషన్లలో ఎన్నాళ్లు బతికినా, ఈ ఆరోపణలు తప్పవు. బతికుండగా ఇక రిజర్వేషన్లలో ప్రవేశించగూడదు. పట్టుబడితే, తెల్లవాళ్లు తనను చంపేస్తారని తెలుసు. కాస్త, ముందూ వెనకా, అపాచీలందరికీ ఇదే గతి పట్టబోతుంది. స్పెనియార్డులు వచ్చినప్పుడు తాము చేసిన పనే ఇప్పుడు చేయాలి. ప్రాణాలకు తెగించి ప్రతిఘటించటమే తమ కర్తవ్యం.

మెక్సికోలో స్థావరం ఏర్పరుచుకొని, యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యటానికి గెరిల్లాలను రిక్రూట్ చేసుకున్నాడు విక్టోరియో. 1879 చివరినాటికి రెండు వందల మంది మెస్కాలేరో, చిరికాహువాలతో సైన్యం ఏర్పడింది. మెక్సికన్ రాంచ్‌ల మీద దాడులు చేసి గుర్రాలను, ఆహారాన్ని సంపాదించారు.

అప్పుడప్పుడూ న్యూ మెక్సికో, టెక్సాస్‌లలోకి చొచ్చుకువచ్చి అశ్వికదళాలను మట్టుబెట్టి ప్రభుత్వాన్ని ఛాలెంజ్ చేశారు.

ఈ పోరాటక్రమంలో, అమెరికన్ల పట్ల విక్టోరియో ద్వేషం మరింత పెరిగింది. శత్రువులను చిత్రహింసలు పెట్టి చంపితే తప్ప అతని కసి చల్లారలేదు. అతడికి మతి భ్రమించిందనుకున్నారు అనుచరులు. సహజంగానే, అతడి గెరిల్లా సైన్యం నుండి వలసలు ప్రారంభమయ్యాయి. అతడి తలకు మూడువేల డాలర్లు బహుమతి ప్రకటించింది ప్రభుత్వం. చివరికి, యునైటెడ్ స్టేట్స్, మెక్సికో దళాలు సంయుక్తంగా గాలింపు ప్రారంభించాయి. 1880, అక్టోబర్ 14 నాడు, చిహువాహువా, ఎల్ పాసోల మధ్య ట్రెస్ కాస్టిలోస్ హిల్స్‌లో విక్టోరియోనూ, అతని సైన్యాన్నీ పట్టుకున్నారు మెక్సికన్ సైనికులు. అతణ్ణీ మరో డెబ్బై ఎనిమిది మందినీ అక్కడికక్కడే వూచకోత కోశారు. అరవై ఎనిమిది మంది స్త్రీలనూ, పిల్లల్నీ అరెస్టు చేశారు. సుమారు ముప్ఫైమంది యోధులు తప్పించుకున్నారు.

ఇంకా వుంది....

కథా నిలయం
శ్రీకాకుళం

పెండ్యాల మురళి



తెలుగు సినిమా వ్యాపార ధోరణిని కొత్తపుంతలు తొక్కించడంలో దగ్గుపాటి సురేష్‌బాబుది అందెవేసిన చెయ్యి. తన తండ్రి రామానాయుడు నుంచి పుణికి పుచ్చుకున్న చిత్రనిర్మాణ కౌశలంతో సోదరుడు వెంకటేష్ చిత్రాలను నిర్మించేవారు. ప్రస్తుతం బయటి హీరోల చిత్రాలను సొంత బ్యానర్ సురేష్ ప్రొడక్షన్స్‌లో చేస్తున్నారు. తాజాగా రవితేజతో 'బలాదూర్' నిర్మిస్తున్నారు. మరోవైపు సినిమాల గురించి పూర్తి అవగాహన ముఖ్యమనే ఉద్దేశంతో ఫిలిం ఇనిస్టిట్యూట్‌ను స్థాపిస్తున్నారు. ఇదిలావుంటే తన కుమారుడు రాణాను కథానాయకుడిగా పరిచయంచేసే బిజీలోనూ ఉన్నారు. సినిమాలకూ రాజకీయాలకు అవినాభావ సంబంధం వున్నా తాను మాత్రం రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టంచేస్తున్న డి. సురేష్‌బాబుతో కాసేపు...

...అప్పుడు మానేస్తా

రవితేజ చిత్రానికి 'బలాదూర్' అన్న టైటిల్ పెట్టడానికి కారణం?

రవితేజ సినిమా అంటేనే పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్ అంశాలుంటాయి. ఇది ఒక ఊరిలో ఉన్న ఇద్దరి అన్నదమ్ముల కథ. ఆ కుటుంబంలో బలాదూర్‌గా తిరిగే వ్యక్తి కుటుంబ బాధ్యతలను ఎలా మోశాడనేది పాయింట్. రవితేజకున్న ఫాలోయింగ్‌రీత్యా ఆయనమీద టైటిల్ పెడితే బాగుంటుందనుకున్నాం. ఆ విషయాన్నే రవితేజకు చెబితే.. 'వద్దండి.. కథమీద పెట్టండి' అన్నాడు. అప్పుడు 'ఇంటికొక్కడు' అనుకున్నాం. కానీ 'ఇంటికొక్కడు..అంటే.. మంచివాడా, చెడ్డవాడా..' అనే అనుమానాలు వస్తాయని ఆఖరికి 'బలాదూర్.. వీడికి బాధ్యతలెక్కువ' అని పెట్టడం జరిగింది.

ఇంకా కుటుంబకథా చిత్రాలు చూస్తారంటారా?

తప్పకుండా చూస్తారు. ఎందుకంటే.. స్వతహాగా మనం కుటుంబ వ్యవస్థ నుంచి వచ్చినవాళ్ళం కనుక ఆ సినిమాలు తీయాలనిపిస్తుంది. అప్పుడప్పుడు లవ్ సినిమాలు తీస్తున్నాం. ప్రేమ పేరుతో ఎన్నో సినిమాలు వస్తున్నాయి. అయినా వాటికి ఆదరణ తగ్గలేదుకదా. 'పోకిరి'లోనూ లవ్ వుంది. అది ఎంత హిట్ అయిందో తెలిసిందే. పదేళ్ళ క్రితం ఇదే ఉదయ్‌శంకర్‌తో 'కలిసుందాంరా' తీశాం. అప్పుడూ ఇదే మాట అడిగారు. అది సూపర్‌హిట్ అయింది. మొన్నీమధ్య అన్నా చెల్లెళ్ళ బంధంతో 'గోరింటాకు' తీశారు. అది ఆడుతుందా? అనే ప్రశ్న మొదట్లో తలెత్తింది. కానీ మహిళలు విపరీతంగా ఆదరిస్తున్నారు. మనిషి ఉన్నంతవరకు సెంటిమెంట్ ఉంటుంది. అందుకే ఫ్యామిలీ సినిమాలకు ఆదరణ వుంటుంది. ఒకవేళ ఫ్యామిలీ సినిమా తీస్తే... జనాలు తిరస్కరిస్తే... అప్పుడు మానేస్తా.

మీ సినిమాను ఆల్‌రెడీ కార్పొరేట్ కంపెనీలు కొన్నాయనే వార్తలొస్తున్నాయ్. నిజమేనా?

లేదు. ఇంకా ఎవరూ ముందుకు రాలేదు. ఇప్పటికే తెలుగు సినిమా రంగంలో కార్పొరేట్ వ్యవస్థ వచ్చేసింది. ఇంకా రెండు, మూడు సంవత్సరాల్లో పూర్తిగా దూసుకుపోతుంది. అప్పుడు నిర్మాణ రంగంలోనూ, మార్కెట్ రంగంలోనూ మార్పులు వస్తాయి. ముంబైలో యాడ్‌ల్యాబ్స్ సినిమాలు యుటీవీ కొంటుంది. వారి సినిమాలు వీరూ... వీరి సినిమాలు వారూ అలా కొనేస్తారు. అలా ఒక్కోసారి అమ్మిన తర్వాత హిట్ అయినవీ, ఫ్లాప్ అయినవీ వుంటాయి. ఇదంతా మార్కెట్‌ను పెంచేదిశగా పయనించేవే. త్వరలో తెలుగు సినిమా మార్కెట్ మరింత విస్తృతం అవుతుంది.

శిక్షణాలయం ఎంతవరకు వచ్చింది?

దాదాపు పూర్తయింది. రామానాయుడు స్టూడియోలో కొత్త బిల్డింగ్ దానికోసమే కేటాయించాం. ఇందులో రచనా విధానంలో కొత్త మెళకువలు, దర్శకత్వం గురించి పూర్తిస్థాయి చర్చలు జరుగుతాయి. పూర్తి పరిజ్ఞానం ఉన్న వారితో క్లాసులుంటాయి. విదేశీ టెక్నాలజీ ఎంతో ముందంజలో ఉంది. దానికనుగుణంగా మనమూ మారాలి. బహుశా ఆగస్టు 15 నాటికి ప్రారంభంకావచ్చు. ఆ వివరాలు త్వరలో వెల్లడిచేస్తా.

కమల్‌హాసన్‌తో మీకున్న అనుబంధం గురించి చెప్పండి?

కమల్‌హాసన్ గ్రేట్ ఆర్టిస్టు. 'దశావతారం'లో ఆయన పోషించిన పది పాత్రలు వర్ణించలేనివి. ఒక్కో పాత్రకు మేకప్ వేయడానికే గంటన్నర నుంచి నాలుగు గంటలు పడుతుంది. చాలా ఓపిగ్గా వేసుకుని సాయంత్రం వరకు ఉండాలి. జీపులో మూడు పాత్రలుంటాయి. వాటిని రోజుకొక పాత్ర చొప్పున షూట్‌చేసి కంటిన్యుయేషన్ ఏమాత్రం దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకోవడం చాలా టాలెంట్‌తో కూడిన పని. పనిపట్ల ఆయనకున్న అంకితభావం 'విచిత్ర సోదరులు'

చిత్రంలో చూశాను. ఓసారి ఆయన్ను కలవడానికి వెళ్ళినప్పుడు అందులో పులికి డబ్బింగ్ చెబుతున్నారు. అది అరిచినట్లే అరవడం..ఇలా చేస్తున్నారు. ఇదే అనుభవం మా అబ్బాయి రాణాకు కలిగింది. ఇటీవలే రాణా కలిసినపుడు ఏదో యానిమల్‌కు డబ్బింగ్ చెబుతూ కన్పించారట. నిజంగా ఆయన డెడికేషన్‌కు హ్యాట్సాఫ్. 'దశావతారం'లో రాణాను అడిగారు. డైరెక్ట్‌గా మేమే పరిచయం చేయాలని వద్దన్నాను.



రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనుందా?

అటువంటి ఆలోచనేలేదు. నాన్నగారు పదేళ్లపాటు రాజకీయాల్లో సేవచేసి విసిగిపోయారు. ఇంకా ఆ రంగంలో నేను చేసేదేమీలేదు. నాకు అన్ని పార్టీలూ కావాలి. కాంగ్రెస్, తెలుగుదేశం, కమ్యూనిస్టులు, లోక్‌సత్తా.. టి.ఆర్.ఎస్.. రేపు రాబోయే చిరంజీవి పార్టీ కూడా కావాలి. అందరితో సఖ్యతగా వుండడమే నాకు కావాల్సింది.

ఎన్నో పార్టీలు వస్తున్నాయి. వీటివల్ల ప్రజలకు ఉపయోగముంటుందంటారా?

నిజం చెప్పాలంటే... ప్రజలకు ఎవరూ ఏంచేయరు? చేయలేరు. క్రీస్తు, బుద్ధుడు వంటివారే చేయలేకపోయారు. అంతటివారే మార్చలేని సమాజాన్ని రాజకీయ నాయకులు మార్చగలరని నేననుకోను. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుని బతుకుతుంటే... అభివృద్ధి పేరుతో అతని స్థలాన్ని లాక్కోవడం ఎంతవరకు సమంజసం చెప్పండి. వాడి బతుకేదో వాడు బతుకుతున్నాడు. డెవలప్ చేస్తామని చేసిందేమీలేదు. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. మేం రామానాయుడు స్టూడియో కట్టినప్పుడు ప్రశాంత వాతావరణం ఉండేది. ఆరుబయట లాన్‌లో కూర్చొనేవాళ్ళం. ఇప్పుడలా లేదు. మస్కిటోకాయిల్స్ తీసుకెళ్ళి కూర్చోవాలి. జూబ్లీహిల్స్ అంతా మురుగుమయంగా తయారైంది. పొల్యూషన్ ఎక్కువైంది. దీని గురించి ఎవరు ఆలోచిస్తున్నారు? ప్రజల్ని రోగాల్లో ముంచెత్తి వైద్యం పేరుతో ఏదో సేవ చేశామనడం ఎంతవరకు సమజం!

చిరంజీవి తన రాజకీయ ప్రవేశం గురించి మీతో ప్రస్తావించారా?

అడిగారు. సహాయం చేయమన్నారు. అందరూ ఒక్కటిగా ఉందాం అన్నారు. ఇండస్ట్రీ ఎదుగుదలకు పాటుపడదాం అన్నారు. సరే అన్నాను. రామారావు ఉన్నప్పుడు అంతా ఒక్కటిగానే ఉన్నా ఇండస్ట్రీ నేడు రెండువర్గాలుగా విడిపోయేట్లు క్రియేట్ చేశారు. అలా కాకుండా అంతా ఒక్క తాటిపై నిలబడితే మంచిదనేది నా అభిప్రాయం. ఆ దిశగా చిరంజీవిగారు కృషి చేస్తారనుకుంటున్నా.

ఈమధ్య సినిమాల్లో అభ్యంతరకర సన్నివేశాలంటూ ఫిర్యాదులొస్తున్నాయి? వీటిపై మీ అభిప్రాయం?

ఇటువంటివి ఆఖరికి ఎటువైపు దారితీస్తాయో అర్థం కావడంలేదు. ముఖ్యంగా పెరిగిన మీడియా దృష్ట్యా త్వరగా ప్రజలకు చేరువవుతోంది. అప్పట్లో 'గణేష్' సినిమాలో లాయర్‌పై కొన్ని డైలాగులుంటే లాయర్లు అభ్యంతరం చెప్పారు. కానీ మీడియాలో అంత ఊపులేదు. అది బయటకు రాలేదు. ఈనాడు మీడియా పెరిగింది. ప్రతి విషయాన్ని ముందుగా మీడియా చెపుతుంటే అది హైలైట్ అవుతోంది. కనీసం థియేటర్‌కు వెళ్ళి చూసే సమయంకూడా వుండడంలేదు. మొన్న 'గోరింటాకు'లో కుంటి, గుడ్డి వంటి పదాలున్నాయని అభ్యంతరాలు చెప్పారు. 'రెడీ' చిత్రంలో సునీల్ పాల్గొన్న సన్నివేశంలో 'పూజకు పనికిరాని పువ్వు..' అనే డైలాగ్ ఉంది. దీనికి హిజ్రాలు అభ్యంతరం చెప్పారు. ఇలాంటివి ఎక్కువయ్యాయి. సినిమా అంటే కామన్‌గా మనం మాట్లాడుకునే సంభాషణలే ఉంటాయి. వాటికికూడా అభ్యంతరం చెబితే ఎలా? రేపు తండ్రీకొడుకుల మధ్య వాగ్వివాదం వస్తే.. తండ్రిని కొడుకు తిడితే... తండ్రుల సంఘం అంటూ వారు ముందుకు వస్తారేమో....! ❄





బాలనేస్తం



చుక్కలు కలిపేస్తే పోలా

కింది చుక్కలన్నింటిని వరుస క్రమంలో కలిపి చూడండి. ఏజంతువు వస్తుందో తెలిసిపోతుంది.



సరిగ్గా ఏది సరిపోతుందబ్బా...

ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో ఒక భాగం కనిపించటం లేదు కదూ. పక్కనేమో ఒకేలాంటివి మూడు బొమ్మలున్నాయి. దీనికి సరిగ్గా సరిపోయే భాగమేదో చూసి అక్కడ పెట్టాలి మరి సరేనా.

బొమ్మేద్దామా!

హాయ్ నేస్తాలూ... పీత బొమ్మ చాలా బావుంది కదూ. అచ్చంగా అలాగే కింద ఇచ్చిన గళ్లలో వేసి మనమూ నేర్చుకుందామే.





కనిపెట్టాలోచ్!

నేస్తాలూ... కుందేలు ఎంచక్కా కూర్చొని టపాకాయలు కాల్చాలని చూస్తోంది. కానీ దానికి ఏ దారాన్ని కాలిస్తే టపాకాయలు పేలతాయో తెలియడంలేదు. మీరు కొద్దిగా సాయం చేయకూడదూ...

టోపీ కావాలా



హాయ్ ఫ్రెండ్స్... ఎక్కడికైనా బయటికెళ్లేటప్పుడు టోపీ వుంటే బావుంటుందనిపిస్తుందికదూ. అందుకే మనం ఈరోజు హ్యాట్ చేయటమెలాగో నేర్చుకుందాం.

ఏమేం కావాలంటే...

మందపాటి చార్ట్ ఒకటి (పెద్దది), గమ్ (జిగురు), కత్తెర, పెన్సిల్, వృత్తలేఖిని, డెకరేటింగ్ పేపర్.

ఏలా చేయాలంటే...

ముందుగా చార్ట్ తీసుకుని దానిమీద పెద్ద సున్నా గీయాలి (మీ తల పట్టే సైజు అన్నమాట). ముందు గీసుకున్న వృత్తానికి మూడు అంగుళాల వెలుపల మొదటి సున్నా కన్నా కొంచెం పెద్దగా ఒకటి, మరో మూడు అంగుళాల తర్వాత మరోటి గీసుకోవాలి. తర్వాత ఏం చేయాలంటే...ముందు పెద్ద సున్నాకి బయట వున్న చార్ట్ మొత్తాన్ని తీసివేసి, రెండు వృత్తాల మధ్యవున్న పేపర్‌ని నీట్‌గా కత్తిరించి విడదీయాలి.

ఇప్పుడు మధ్యలో మిగిలిన సున్నాకి కట్ చేసిపెట్టుకున్న రెండవ వృత్తాన్ని నిలువుగా అంటే 90 డిగ్రీల కోణంలో జాగ్రత్తగా అతికించుకోవాలి. ఇది ఆరిపోయిన తరువాత అన్నింటికన్నా పెద్దగా వున్న మూడవ వృత్తాన్ని కూడా దీనికి అడ్డంగా అంటే మరలా 90 డిగ్రీల కోణంలో అతికించుకోవాలి. ఆరేవరకు కదిలించకూడదు. ఇప్పుడు టోపీ ఆకారం వచ్చింది కదా. ఇక దీనిని ఇంకా అందంగా చేయాలంటే డెకరేటింగ్ పేపర్ తీసుకుని మనకు కావలసిన ప్రదేశాలలో గమ్‌పెట్టి అతికించుకోవడమే. చూశారుగా అందమైన టోపీ రెడీగా వుందికదా! ఇక పెట్టుకుని షికారుకెళ్లడమే ....!





ఏవి ఎన్ని?

పిల్లలూ...! ఇక్కడ కొన్ని చతురస్రాలూ, త్రిభుజాలూ కనిపిస్తున్నాయి కదా! వీటిలో త్రిభుజాలెన్నో, చతురస్రాలెన్నో విడివిడిగా లెక్కపెట్టి చెప్పాలి. అదీ చిటికెలో...

జవాబు : త్రిభుజాలు 10, చతురస్రాలు 7.

బర్గర్ ఎలా దొరుకుతుంది

పిల్లలూ...ఈ అబ్బాయికి బర్గర్ అంటే చాలా ఇష్టం. కానీ అది కావాలంటే లెక్కలు చేసుకుంటూ వెళ్లాలి. చివరికి మాత్రం 12 రావాలి. ఏదారిలో లెక్క మొత్తం చేస్తే చివరికి 12 వస్తుందో అదే సరైన దారి. మరి పెన్నో పెన్సిలో తీసుకోండీ!



విశ్వక్రీడా వైభవం

ఒలింపిక్స్

డా॥ కాకర్లమూడి విజయ్

క్రీడలకు ఏనాటి నుండో ఆదరణ, ప్రాముఖ్యం ఉన్నాయి. ఆరంభంలో కాలక్షేపం కోసమే క్రీడలు ఆరంభమైనా, అవి రాను రాను తెగింపు, పట్టుదల, విజయం, గర్వం, ఆరోగ్యం, ఆనందం, ప్రతిష్ఠ వంటి అంశాలకు ఆలవాలమయ్యాయి. ఈనాడు ప్రతిరోజూ ప్రపంచంలో ఏదో ఒక చోట ఏదో ఒక ఆటలపోటీలు జరిగే స్థాయికి చేరాము. అయినా ప్రపంచమంతా ఎంతో ఆతృతగా ఎదురుచూచేది నాలుగేళ్లకోసారి వచ్చే ప్రపంచక్రీడల పోటీలకే, అదే ఒలింపిక్స్. ఈ సారి ఒలింపిక్స్ చైనాలో జరగనున్నాయి. క్రీడాకారులనే కాకుండా ప్రతి ఒక్కరినీ ఆకర్షించి, ఆసక్తి కలిగించే ఒలింపిక్స్ విశేషాలు మీకోసం.

ఒలింపిక్స్ ప్రపంచక్రీడలే కాదు, అత్యంత ప్రాచీనమైనవి కూడా! వీటి ఆరంభంపై అనేకానేక కథనాలు ఉన్నాయి. కానీ వాటిలో ఎక్కువ ప్రచారంలో ఉన్నది... హిరాక్లిస్ అనే గ్రీకు రాజు (రోమన్‌లో హెర్క్యులిస్) తన తండ్రి గౌరవార్థం ఈ ఆటల్ని ప్రారంభించాడనీ అంటారు. ఒలింపిక్ స్టేడియంని కూడా ఆయనే నిర్మించాడని చెప్తారు.

అయితే మనకు చారిత్రాత్మక ఆధారాలు మాత్రం క్రీస్తుపూర్వం 776వ సంవత్సరం నాటివి ఉన్నాయి. ఆనాటి పోటీలో కోరోబస్ అనే అతను 192మీటర్ల పరుగు పందెంలో గెలిచి ఒలింపిక్ చరిత్రలో తొలి ఛాంపియన్ అయ్యాడు. ఆ ఆటలు నిరాటంకంగా ప్రతి నాలుగేళ్లకోసారి దాదాపు 1200 సంవత్సరాల పాటు కొనసాగాయి. అయితే ఎప్పుడైతే రోమన్లు గ్రీకు దేశాన్ని స్వాధీనం చేసుకున్నారో, అప్పటినుండి ఈ క్రీడలకి దుర్దశ పట్టింది. క్రీస్తు శకం 393లో థియోడోసియస్-1 అనే రోమన్ చక్రవర్తి క్రైస్తవాన్ని రాజ్యమంతా ప్రకటించి, అందుకు భిన్నమైన పండగల్ని, ఆచారాల్ని నిషేధించాడు. ఆ క్రమంలోనే ఒలింపిక్స్ కూడా నిలిచిపోయాయి.

యువకులకు మాత్రమే...!

ప్రాచీన ఒలింపిక్స్‌లో యువకులు మాత్రమే పాల్గొనే వీలుండేది. పోటీలు ప్రధానంగా మానవ శరీర విన్యాసాల సాధనను గుర్తించేవి. గెలుపొందిన వీరులకు ఆశకు, శాంతికి గుర్తైన ఆలివ్ ఆకుల కిరీటాన్ని బహూకరించేవారు.

దాదాపు 1500 ఏళ్లపాటు ఒలింపిక్స్ జరగలేదు. ఆ తరువాత పియర్ డి కౌబర్టిన్ అనే ఫ్రెంచి అతను తిరిగి వీటిని ఆరంభించాడు. 1870 లో జరిగిన యుద్ధంలో ఫ్రెంచ్ జర్మనీ చేతిలో ఓడిపోయింది. తమ ఓటమికి కారణం సైనిక వ్యూహాల వైఫల్యం కాదు గానీ, తమ సైనికులలో కొరవడిన శారీరక సామర్థ్యమని కౌబర్టిన్ భావించాడు. అటువంటి సంపూర్ణ శారీరక అభివృద్ధి, ప్రతిష్ఠత కొరకు వ్యాయామం, ప్రత్యేకించి క్రీడలు అవసరమని నిర్ధారించాడు. అయితే కౌబర్టిన్ ప్రతిపాదన అంత సులభంగా ఆమోదం పొందలేదు. అతను 1890 లో ఒక క్రీడా సమాఖ్యను కూడా ఏర్పాటు చేశాడు. అయినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఇలా లాభం లేదనుకుని ఆగిపోయిన ఒలింపిక్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించాడు. ఆ తరువాత ఆ దిశగా ఎన్నో ప్రయత్నాలు చేశాడు. తొమ్మిది దేశాల నుండి వచ్చిన 79 మంది ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఒలింపిక్స్ పునరుద్ధరణ గురించి ఉపన్యసించాడు. ఈసారి అతని మాటలు ప్రభావం చూపాయి. ప్రతినిధులందరూ అతనితో ఏకీభవించారు. అందుకోసం ఒక అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీని ఏర్పాటు

సర్వం సన్నద్ధం

చేశారు. సరికొత్త ప్రపంచ క్రీడలకు ఏథెన్స్‌ని ఎన్నుకొన్నారు. కార్యక్రమాలు ముమ్మరంగా ప్రారంభించారు.

ఆధునిక ఒలింపిక్స్

తొలి ఆధునిక ఒలింపిక్స్ 1896, ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యాయి. అప్పట్లో స్టేడియం కట్టడానికి గ్రీక్ ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే జార్జిస్ ఏవరాఫ్ అనే ధనిక గ్రీకు ఆర్కిటెక్ట్ ఆర్థికసాయం చేసి క్రీస్తుపూర్వం 330లో నిర్మించిన పానాథెనాయిక్ స్టేడియాన్ని బాగు చేయించాడు.

ఈ ఆటలకు అంతగా ప్రచారం లేకపోవడంతో ప్రపంచదేశాల క్రీడాకారులు పెద్దగా రాలేదు. ఆ సమయంలో గ్రీకు దేశం చూడటానికి వచ్చిన పర్యాటకులు కూడా కొందరు పోటీల్లో పాల్గొన్నారు! మొత్తానికి 10 అంశాల్లో, 14 దేశాలనుండి వచ్చిన (సొంత ఖర్చులతో) 241 మంది క్రీడాకారులు ఆనాడు పాల్గొన్నారు. క్రమేపీ ఒలింపిక్స్ స్ఫూర్తి వ్యాపించి, ప్రజాదరణ పొందింది. రెండవ ఆధునిక ఒలింపిక్స్ కూడా తమ దేశంలోనే జరగాలని గ్రీకు పట్టుపట్టింది. అయినా ఒలింపిక్స్ కమిటీ అందుకు పారిస్‌ను వేదికగా ఎంచుకుంది. స్త్రీలు కూడా ఈ క్రీడల్లో పాల్గొనడం అప్పటినుండే మొదలైంది. అయినా సరే ఒలింపిక్స్‌కి నిజమైన ప్రజాదరణ మాత్రం 1906 లో కలిగిందని చెప్పవచ్చు. విశేషంగా అంతర్జాతీయ క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు.

ఒలింపిక్స్ రెండు రకాల

ఒలింపిక్స్ లో వేసవి, శీతాకాలపు క్రీడలు వేర్వేరుగా ఉన్నాయి. సాధారణంగా వేసవి క్రీడలు ప్రధానమైన నగరాలలో నిర్వహిస్తే, శీతాకాలపు క్రీడలు శీతల ప్రదేశాలలో జరుగుతాయి. ఈ రెండు క్రీడలూ నాలుగేళ్లకోసారి, ఒకే సంవత్సరంలో నిర్వహించడం జరుగుతుంది. అయితే 1994 నుండి ఈ రెండు క్రీడలకి రెండేళ్ల అంతరం ఉండేలా జరుపుతున్నారు. ఈ సారి వేసవి ఒలింపిక్స్ 2008లో జరిగితే, శీతాకాలపు ఒలింపిక్స్ 2010లో వాంకూవర్ (కెనడా) లో జరుగుతాయి. అవి 21 వ వింటర్ ఒలింపిక్స్. అవి ఫిబ్రవరి 12 నుండి 28 వరకూ జరుగుతాయి.

ఆర్భాటంగా ప్రారంభోత్సవాలు

ఒలింపిక్స్ క్రీడల చుట్టూ ఒక వర్ణమయ వాతావరణం ఉంటుంది. బ్రహ్మాండమైన నిర్మాణాలు, మరింత హంగూ ఆర్భాటాలతో ప్రారంభోత్సవాలు ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆకర్షణని, ఆదరణని చూరగొంటున్నాయి. ఈ క్రీడలు జరిగే రోజులన్నీ పండగ వాతావరణంతో కళకళలాడుతూ ఉంటాయి.

ఈ క్రీడల ప్రారంభోత్సవాలే కనువిందు చేస్తాయి. ప్రారంభోత్సవాలు జరిగే స్టేడియంలోకి ముందుగా గ్రీసు క్రీడాకారులు మైదానంలోకి ప్రవేశిస్తారు. ప్రాచీన ఒలింపిక్స్ గ్రీసులో జరిగినందుకు గౌరవంగా వారికి ముందస్తు ప్రవేశం కల్పిస్తారు. ఆ తరువాత మిగతా పాల్గొనే దేశాల క్రీడాకారులు అక్షర క్రమం ప్రకారం కవాతు చేస్తారు. అయితే ఆ అక్షరక్రమం ఆతిథ్యం ఇచ్చే దేశ భాష ప్రకారం ఉంటుంది. చివరగా ఆతిథ్యం ఇచ్చే దేశ క్రీడాకారులు ప్రవేశిస్తారు.

ఆతిథ్యం ఇచ్చే దేశాధ్యక్షులు క్రీడలు ప్రారంభమైనట్టు అధికారికంగా ప్రకటించిన తరువాత ఒలింపిక్ పతాకం అవనతం చేస్తారు. బాకాలు ఊదడం, ఫిరంగులు పేల్చడం, పావురాలను వదలడంతో... వాతావరణం ఒక్కసారిగా అద్భుతరూపాన్ని సంతరిం చుకుంటుంది.

ఆటలు ముగిసే వరకూ వెలిగే జ్యోతి

మరొక నాటకీయ ఘట్టం ఒలింపిక్ జ్యోతిని వెలిగించటం. ప్రాచీన ఒలింపియాలో వెలిగించిన జ్యోతి దేశదేశాల్లో తిరిగి ఆటలు జరిగే దేశానికి చేరుతుంది. ఒలింపియా, ఆతిథ్యం ఇచ్చే దేశానికి మధ్యనున్న దేశాలన్నింటిలో ఈ జ్యోతి ప్రవేశిస్తుంది. ప్రతిచోటా ప్రసిద్ధ క్రీడాకారులు ఈ జ్యోతిని చేతబూని పరిగెడతారు. కొండలు, పర్వతాలు, సముద్రాలలో విమానాలు, ఓడలు జ్యోతిని తీసుకుని పోతాయి. ఒలింపిక్ మైదానంలో వెలింగిచిన జ్యోతి ఆటల ముగింపు వరకూ వెలుగుతూ ఉంటుంది.

మైత్రి... శాంతి... పెంపొందించడానికే....

ఆధునిక ఒలింపిక్స్ ప్రపంచ దేశాలమధ్య మైత్రిని, శాంతిని పెంపొందించే ఉద్దేశంతో ప్రోత్సహించ బడుతున్నాయి. అదే స్ఫూర్తిని సూచిస్తూ ఐదు వలయాల చిహ్నం రూపొందించాడు కౌబర్టిన్. ఐదు ఖండాలను సూచిస్తూ ఈ రింగులు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. ఉద్దేశాలు ఘనంగానే ఉన్నా చాలా సార్లు ఈ ఆటలు రాజకీయ అలజడులకు ఆలవాలమయ్యాయి. ఈసారి కూడా టిబెట్ సమస్య కాస్త ఇబ్బంది పెట్టింది.

ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు రానుపోను రవాణా సౌకర్యాలు, యూనిఫాం వంటివన్నీ మాతృదేశమే సమకూర్చుతుంది. భోజన, వసతులు మాత్రం ఆతిథ్యమిచ్చే దేశం చూసుకుంటుంది.

ప్రతి దేశం వ్యక్తిగత క్రీడలకు ముగ్గురి చొప్పున, బృందక్రీడలకు ఒక బృందాన్ని

ఒలింపిక్ జ్యోతి

మస్కట్లు...



ఒలింపిక్స్‌లో భారత్

ఒలింపిక్ పతకంతో పేస్

భారతదేశం తొలిసారిగా పారిస్‌లో జరిగిన (1900) ఒలింపిక్స్‌లో పాలుపంచుకుంది. విశేషమేమిటంటే ఆ సమయంలో పారిస్‌లో పర్యటిస్తున్న నార్మన్ పిట్‌చర్డ్ అనే ఒక ఆంగ్లో ఇండియన్ మన దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. ఆయన 200మీ డాష్‌లోనూ, 200 మీ హర్డిల్స్‌లోనూ రెండు పతకాలను గెలుచుకున్నాడు.

ఆ తరువాత 20 ఏళ్ల పాటు (ఒలిపింక్స్‌లో) మన దేశం ఒలింపిక్స్‌లో పాల్గొనలేదు. 1920లో ఆంట్వర్ప్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో ఇద్దరు క్రీడాకారులతోనూ, 1924లో పారిస్‌లో జరిగిన క్రీడల్లో 8 మంది తోనూ పాల్గొంది.

1927లో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ ఏర్పడింది. 1928లో ఆమ్‌స్టర్‌డామ్‌లో జరిగిన క్రీడల్లో తొలిసారి భారత్ హాకీ జట్టు పాల్గొంది. జైపాల్‌సింగ్ నేతృత్వంలో స్వర్ణ పతకం సాధించింది. ఆ తరువాత 1928-1956 మధ్యలో - 28 ఏళ్ల పాటు తమ స్వర్ణ పతక స్థాయిని పదిలంగా కాపాడుకుంటూ వచ్చింది భారత హాకీ జట్టు. అది ఒక స్వర్ణయుగం, ధ్యాన్‌చంద్ అనే హాకీ మాంత్రికుడు తన అద్భుతాలను ప్రదర్శించిన యుగం అది. 24 ఆటల్లో మొత్తం గెలవడం, 178 గోల్స్ కొట్టి 7 మాత్రమే వదలడం - నభూతో న భవిష్యత్.

ఆ తరువాత 1964 (టోక్యో), 1980 (మాస్కో)లో కూడా మన హాకీ జట్టు స్వర్ణాన్ని సాధించింది.

ఇక ఆ తరువాత మన విజయాలు అంతంత మాత్రమే. ఎథ్లెటిక్స్‌లో మిల్కాసింగ్, గుర్‌బచన్ రన్ధావా, పిటి ఉష వంటి వారు కొన్ని స్థానాలు సాధించారు. అలాగే కుస్తీలో దాదాసాహెబ్ యాదవ్, వెయిట్ లిఫ్టింగ్‌లో కరణం మల్లీశ్వరి (2000, సిడ్నీ), టెన్నిస్‌లో లియాండర్ పేస్ (1996, అట్లాంటా) వంటి విజయాలు మినహా వందకోట్లు పై బడ్డ జనాభాలో చెప్పుకోదగ్గ ప్రాతినిధ్యం క్రీడల్లో లేకపోవడం విచారించదగ్గ విషయం.

మరింత దుర్వార్త ఏమిటంటే -హాకీలో భారత్‌ను ఎదుర్కోవడం కల్ల అని ఒకప్పుడు దేశదేశాలు చేతులెత్తేసేలా చేసిన హాకీ జట్టు ఈ సారి కనీసం ప్రవేశం కూడా సాధించలేకపోవడం!

పంపవచ్చు. ఫుట్‌బాల్ మినహా ప్రతి పురుషుల టీమ్ ఆటలకి 12 టీమ్‌లు పోటీపడవచ్చు. ఫుట్‌బాల్‌కి 16 టీమ్‌లు పాల్గొంటాయి. ఒకవేళ గరిష్ట టీములకంటే ఎక్కువ దేశాలు వస్తే క్వాలిఫయింగ్ పోటీలు నిర్వహిస్తారు.

పతకాల వివరాలు

గెలుపొందిన క్రీడాకారులు మెడల్, సర్టిఫికెట్ పొందుతారు. వీటిని మొదటి ముగ్గురు విజేతలకీ అందిస్తారు. ఆ తరువాతి ఐదుగురికి కేవలం సర్టిఫికెట్ మాత్రమే లభిస్తుంది. మొదటి, రెండవ స్థానాలకు వెండి పతకాలు ఇస్తారు. మొదటి స్థానపు పతకానికి బంగారపు పూత ఉంటుంది. మూడవస్థానానికి ఇత్తడి పతకం ఇస్తారు. రిలే పోటీల్లో ఫైనల్లో గెలుపొందిన జట్టు సభ్యులందరికీ పతకాలు ఇస్తారు. పతకాల నమూనాలు పెద్ద మార్పులేమీ ఉండవుగానీ వింటర్ ఒలింపిక్‌కి మాత్రం ప్రతిసారీ మారుతూనే ఉంటాయి. పతక బహూకరణ సమయంలో ప్రథమ స్థానాన్ని పొందిన క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశ జాతీయ గీతాన్ని వాద్యాలతో వినిపిస్తారు.

నిజమైన క్రీడాస్ఫూర్తి కోసం ఒలింపిక్ కమిటీ ఏ దేశాన్నీ విజేతగా పరిగణించదు. కేవలం మీడియా వాళ్లే ప్రతిదేశానికీ పతకాల పట్టికను ప్రకటించి ప్రచారం చేస్తుంది.

నిజానికి ఒలింపిక్ స్ఫూర్తే అది - ఎవరూ విజేతలు కారు. అందరూ తమతమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడమే దాని ఉద్దేశం. అయినా సరే ఎన్నో రకాలు సమస్యలు- రాజకీయాలు, విధ్వంసం, టెర్రరిజం, మాదకద్రవ్యాలు ఒలింపిక్స్‌కి విఘాతాన్ని కలిగిస్తూనే ఉన్నాయి. అయిదు రంగుల వలయాలు కలిసినట్టుగా ప్రపంచ దేశాలన్నీ కలిసి సామరస్యంగా జీవించడమే ఒలింపిక్స్ అసలు ఉద్దేశం. అదే నిజమైతే ఈ ప్రపంచ క్రీడలు ప్రపంచ పండగ సంబరాలుగా వెలుగొందుతాయి.

సర్వాంగ సుందరంగా సిద్ధమైన చైనా

ఈ ఏడాది జరుగుతున్నది 29వ ఒలింపియాడ్. ఇది చైనాలోని బీజింగ్‌లో ఆగస్టు 8 నుండి 24 వరకూ జరుగుతుంది. 2001, జులై 31న మాస్కోలో జరిగిన 10సి సమావేశంలో బీజింగ్ ఎంపికైంది. ఈ క్రీడల్లో దాదాపు పదివేలకు పైగా క్రీడాకారులు పాల్గొనున్నారు.

బీజింగ్ ఒలింపిక్స్‌లో అతి ఆకర్షణీయమైనదీ బీజింగ్ నేషనల్ స్టేడియం. దీని నిర్మాణమే ఒక అద్భుతం. దీనిపేరు బర్డ్ నెస్ట్ (పక్షి గూడు). గూడులో ఉండే పుల్లల్లా దీనిలో అస్థిపంజరం కాంక్రీటుతో, విచిత్రంగా నిర్మించబడింది. దీనిలో 80,000 మంది కూర్చుని క్రీడల్ని తిలకించవచ్చు. దీనిలోనే ఒలింపిక్స్ ప్రారంభ, ముగింపు సంబరాలు జరుగుగాయి. ఇవికాక ఇతర క్రీడాపోటీలు, సాకర్ ఫైనల్స్ కూడా ఇందులోనే జరుగుతాయి.

ప్రారంభ వేడుకలు 8.8.08 న 8:08:08 సమయానికి మొదలౌతాయి. ఇందులో ఇంతవరకూ జరగని విధంగా, ఘనంగా 15000 మందితో అద్భుత కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు అంటున్నారు.

బీజింగ్ నేషనల్ స్టేడియంకి దగ్గరిలోనే నేషనల్ అక్వాటిక్స్ సెంటర్ ఉంది. వాటర్‌క్యూబ్‌గా పరిగణించే ఈ నిర్మాణం నీటి బుడగల రూపంలో ఉండటం విశేషం. ఇథిలీన్ టెట్రాఫ్లోరోఇథిలీన్(ETFE) అనే పాలిమర్ తో ఈ



రడీ వన్... టు... త్రీ



ఒలింపిక్ జ్యోతితో బాలివుడ్ నటి బిపాషాబసు



సంఖ్యాశాస్త్రం

ప్రతి దేశంలో ఉన్నట్టుగానే చైనా కూడా సంఖ్యా'శాస్త్రం'కి లోబడే ఉంది. ప్రత్యేకంగా 8 చైనాలో వర్ధిల్లడానికి ఆనవాలు. ఎన్ని ఎక్కువ 8లు ఉంటే అంత ఎక్కువ అదృష్టం, ఐశ్వర్యం వర్ధిస్తాయని చైనీయుల విశ్వాసం. ఆగస్టు 8, 2008న (8/8/8) ఎనిమిది గంటల 8 నిమిషాలు, 8 సెకన్లకు 28వ ఒలింపిక్ క్రీడల్ని చైనాలో ప్రారంభించ నున్నారు. ఈ సమయాన్ని ఎంచుకోవడానికి వారి నమ్మకమే కారణం.

ప్రస్తుతం చైనాలోనూ, ఇతర దేశాలలోనూ ఆగస్టు 8న వివాహం వంటి ముఖ్యమైన కార్యక్రమాలు జరిపించుకోవడానికి విపరీతమైన సన్నాహాలు జరుగుతున్నాయి.

గతంలో 7-7-07 సృష్టించిన హడావుడి తరువాత అన్ని ఎనిమిదిలు వున్న తేదీ ఎక్కువ మంది కోరుకునే పెళ్లి రోజుగా మారింది.

నిర్మాణం జరిగింది. అంగుళంలో 8/1000 మందం మాత్రమే ఉండే ఈ పదార్థంలో దాదాపు లక్ష చదరపు మీటర్ల మేర నిర్మాణం రూపొందింది. ఈ పదార్థం ద్వారా మామూలు గాజు కంటే మెరుగైన కాంతి, వేడి ప్రసరణ వీలౌతుంది. దీంతో విద్యుత్ ఖర్చూ తగ్గుతుంది. ఇందులో ఈతల పోటీలు జరుగుతాయి.

ఈ క్రీడలకోసం చైనా కాలుష్య, రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా వీటిని నిర్వహించాలని కంకణం కట్టుకుంది.

ఆగస్టు 24న క్రీడలు ముగిసిన తరువాత సెప్టెంబర్ 6 నుండి 17 వరకు శారీరక, మానసిక వికలాంగుల కొరకు పారాలింపిక్స్ కూడా బీజింగ్‌లోనే జరుగుతాయి. వేసవి ఒలింపిక్స్ తరువాత అదే దేశంలో పారాలింపిక్స్ కూడా జరగడం ఆనవాయితీ.

వేగంగా వీచే గాలులు...
వర్షంలోనూ వెలిగే జ్యోతి

మార్చి 24, 2008న గ్రీసులోని ఒలింపియాలో వెలిగించిన జ్యోతే ఆగస్టు 8న బీజింగ్ ప్రవేశిస్తుంది. ప్రతిసారీ ఒలింపిక్ జ్యోతికి ఏదో కొత్తదనం, ప్రత్యేకత ఉంటుంది. ఈ సారి జ్యోతి గంటకు 65 కి.మీ. వేగంతో వీచే గాలుల్ని సైతం లెక్కచేయదు. అంతేకాదు గంటకు రెండు అంగుళాల వర్షంలో కూడా ఈ జ్యోతి నిరాటంకంగా ప్రజ్వలిస్తూనే ఉంటుంది. ఉంది కూడా!

ఇంతకు ముందు జ్యోతులకు ప్రొపలీన్- బ్యుటేన్ వాయువుల సమ్మేళనం వాడేవాళ్లు. అది మరింత ప్రకాశవంతంగా వెలిగినా, నల్లని పొగ విడుదల అయ్యేది. ఈ సారి కేవలం ప్రొపేన్ వాయువునే వాడారు. ఇది కాస్త తక్కువ ప్రకాశవంతంగా ఉంటుంది.

చైనాలోని జాతీయ ఏరో స్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఒలింపిక్ జ్యోతిని రూపొందించింది.

ప్రాచీన గ్రీకు ప్రజలకు అగ్ని పవిత్రమైనది. చాలా జాతులకు కూడా. ఒలింపియాలో శాశ్వతంగా అగ్ని వెలుగుతూనే ఉంటుంది. అప్పట్లో ఒలింపిక్ క్రీడల సమయంలో జియస్, అతని భార్య హీరాల ఆలయం వద్ద అదనంగా జ్యోతులను వెలిగించే వాళ్లు. హీరా ఆలయం ప్రదేశంలోనే ఆధునిక ఒలింపిక్ జ్యోతి వెలిగిస్తారు.

జ్యోతి వెలిగించే తతంగం విశేషంగా ఉంటుంది. పదకొండు మంది స్త్రీలు పూజారిణుల మాదిరి ఈ కార్యక్రమాన్ని సాగిస్తారు. పెద్ద అద్దాలతో సూర్యుడి కిరణాలను కేంద్రీకృతం చేసి పవిత్ర అగ్నిని రగిలిస్తారు.

బీజింగ్‌లో ఉపయోగించే జ్యోతిలో ప్రొపేన్ వాయువు 15 నిమిషాల పాటు వెలుగుతుంది. ఈసారి మార్చి 24న జ్యోతిని వెలిగించారు. మన దేశంలో జ్యోతి ఏప్రిల్ 17న ప్రవేశించింది. టిబెట్ నిరసన నేపథ్యంలో మన దేశంలో జ్యోతి ప్రయాణాన్ని 2.3 కి.మీకి కుదించారు. ఈ కార్యక్రమంలో 70 మంది పరుగు క్రీడాకారులు పాల్గొన్నారు. మే 8న జ్యోతిని ఎవరెస్టు పైకి కూడా తీసుకువెళ్ళారు.

మొత్తం 129 రోజులు, 1,37,000 కి.మీ. దూరం ప్రయాణించిన, ఈ ఒలింపిక్ జ్యోతి బీజింగ్ చేరుతుంది.



నేషనల్ అక్వాటిక్స్ సెంటర్

ఒలింపిక్ చిహ్నాలు

గుర్తు: నీలం, నలుపు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ వలయాలు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉన్న చిహ్నం ఒలింపిక్స్‌కి సుపరిచితమైన గుర్తు. అయిదు ఖండాలు (ఉత్తర, దక్షిణ అమెరికాలను ఒకే ఖండంగా పరిగణించారు), ప్రతి జాతీయ జెండాలలో, ఈ చిహ్నంలోని అయిదు రంగులలో కనీసం ఒకరంగైనా ఉండటం ఈ చిహ్నపు విశేషం. దీనిని కౌబర్టిన్ 1913లో రూపొందించాడు. 1914లో ఆమోదం పొందిన ఈ చిహ్నాన్ని 1920 క్రీడలలో ఉపయోగించారు.

పతాకం: ఇదే గుర్తు తెలుపు నేపథ్యం పై జెండాలా ఉంటుంది. దీనిని కౌబర్టిన్ 1914లో రూపొందించాడు.

మోటో: ఒలింపిక్ స్ఫూర్తిని ప్రకటిస్తూ 1894లోనే కౌబర్టిన్ ఒక మోటోను రూపొందించాడు. 'సైటియస్, ఆల్టియస్, ఫోర్టియస్' అనే మాటలు లాటిన్ భాషలోనివి. వాటి అర్థం 'మరింత వేగం, మరింత ఎత్తు, మరింత శక్తి'. దీనిని 1924 పారిస్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు.

మస్కట్: ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే దేశాలలో బాగా ప్రాచుర్యం పొందిన రూపాలను ఆయా క్రీడల మస్కట్‌లలాగా వాడతారు. మన దేశంలో జరిగిన ఆసియా క్రీడలకు 'అప్పూ'ని వాడినట్టు అన్నమాట. 2008 క్రీడలకు 'అదృష్ట బొమ్మలు' ఫువా (FUWA). ఈ 5వ బొమ్మలు చేప, పాండా, అగ్ని, దుప్పి, పక్షి రూపాలు.

స్లోగన్ ఈసారి ఒలింపిక్ క్రీడల స్లోగన్' ఒకే ప్రపంచం, ఒకే స్వప్నం'.

మిలట్రీ పెట్టె

యర్నాగుల సుధాకరరావు

"సిట్టిరాజు పోటో ఒకటి ఇవ్వకూడదు. నా నేస్తాలు రోజూ అడుగుతున్నారు. మేమేమైనా కొరుక్కుతింటామా? అని అంటున్నారు" సిగ్గుతో నేల చూపులు చూస్తూనే అడిగింది. ముత్తేలుకు గుండెల్లో రాయి పడింది. అసలు ఆడు ఎలా ఉంటాడో తనకు తెలీదు. ఆ చిన్నతనం, ఆ పసిముఖం తనకు గుర్తు. ఏదో సర్దిసెప్పి సన్నాసమ్మను పంపేసాడు.

యావజ్జీవఖైదీ ముత్తేలును జైలర్‌గదికి తీసుకుని వెళ్లారు వార్డర్లు. ఆగదిలోకి అడుగెడుతూనే "అయ్యా! నన్నెందుకు హాజరవ మన్నారు. నాకు తెలిసీ ఏతప్పు చేయనేదు" జైలర్ ఎదురుగా నిలబడి భయంగానే నసిగాడు.

"ముత్తేలు! నిన్ను ఈ రోజు విడుదల చేయమని ఆర్డరు వచ్చింది. నీవు మరోగంటలో ఈ జైలు వదిలిపోతావు. నీవు ఇన్నాళ్లు జైలులో చేసిన కష్టానికి నీకు ముట్టినది వేలల్లో ఉంది. మంచిగా బ్రతుకు. నీవు ఆరుగురుతో కలిసి హత్య చేసి తగలెట్టేసిన కేసులో శిక్ష అనుభవించావు. నేరవృత్తివైపు కనీసం తొంగిచూడకుండా మరో మంచి జీవితాన్ని ఎంచుకో!" చెప్పాడు జైలర్.

ఆ మాటలు ముత్తేలుకు గుండెల్లో మంచు ముక్క తిప్పినట్లయ్యింది. "అయ్యా! ఇక్కడే సచ్చిపోతాననుకున్నాను. నన్ను ఇడుదల చేస్తున్నారంటే ఎనలేని సంతోషంగా ఉంది" కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

ఆరోజు ఉదయం జైలులోంచి సాధారణ దుస్తులతో బయటికి వచ్చాడు. పంజరంలో చిలుకకు స్వేచ్ఛ లభించినట్టుగా ఉప్పొంగిపోయాడు. వాస్తవానికి అతడికి జైలు వదిలిరావాలని లేదు. అక్కడ ఎంతో మందితో స్నేహంగా ఉండేవాడు. "నాకున్న ఒక్కగానొక్క మనవడు సిట్టిరాజు ఎలా ఉన్నాడో ఆడిని కలుస్తాను. తను జైలులో సంపాదించుకున్నది ఆడిచేతిలో పెట్టేస్తేచాలు" అని సంబరంగా నడవసాగాడు.

నాలుగురోడ్ల కూడలిలో నిలబడి... "నేను ఏ దిశలో అయినా నడవగలను. ఎందుకంటే నేను ఈరోజు స్వేచ్ఛాజీవిని" అని గుండెలనిండుగా గాలి పీల్చుకుని కదిలాడు. తిన్నగా బస్సుఎక్కి సాయంత్రానికి కొండలమాటునున్న తన చిన్న ఊరు సిమ్మాద్రిపేటకు చేరుకున్నాడు.

పన్నెండేళ్లు గడిచినా ఊళ్లో ఏవిధమైన మార్పు రాలేదు. తన వయస్సు డెబ్బైఏళ్లు, పుట్టిపెరిగిన ఊరును చూసుకుని, చల్లనిపిల్లగాలులు ఏపుగా పెరిగిన పచ్చని పంటల మీదనుంచి వస్తూంటే అరమోడ్పుగా కన్నులు మూస్తూ తెరిచాడు. తిన్నగా ఊరుపెద్దరైతు ఇంటిముందు నేలమీద కూర్చున్నాడు.

పెద్దరైతు చూడనే చూశాడు. "ఎప్పుడొచ్చీసినావురా! జైలుకూడు నీకు బాగా పడ్డాదిరా. బక్కగా ఉన్నోడివి, నాకొండే బుల కొక్కులా అయిపోనావురా! ఏటిసేద్దుమని వచ్చినావు. మళ్లీ వల్లకాట్లో పీనుగులు తగలె య్యడమేనా... నువ్వు బొక్కలోకి ఎళ్లిపోయినాక ఇక్కడొక్కడు సరైనోడు దొరకలేదు. వల్లకాడు కాటికాపరి లేకుండా పోయింది".

"అయ్యా! నామనవడు సిట్టిరాజుగాడు కోసం వచ్చాను. ఎక్కడున్నాడు చెప్పయ్యా? ఆడిని సూద్దామని మా తహతహగా ఉంది".

"ఒరేయ్, నీకు సెప్పకేటిగానీ నువ్వు బొక్కలోకి ఎల్లేటప్పుడు ఆడిని చూసుకోమన్నావు. ఆడు నాకు అగుపడితేకదా! అయినా మాలాటోళ్ల కడుపులో పుట్టినోళ్లే ఇటుపిలిస్తే అటు పలకతన్నారు. నీలాటోడి పిల్లకాయగాడు ఏటిపనికి వస్తాడురా! నీ బెమకానీ, ఆడు చీట్లపేకాటోళ్లతోనో, జేబుకాటుగాళ్లతోనే కలిసిపోయి నీలాగునే ఏదో ఒకజైల్లో ఉండుంటాడు. వస్తాడులేరా, నువ్వు వచ్చినావుకదా ఏటి తెచ్చినావో అని వాడు రాడా ఏటి?"

ముత్తేలుకు కళ్లనీళ్లు తిరిగిపోయాయి. లేచి వల్లకాటివైపు వెళ్లాడు. అక్కడ చెరువుగట్టుమీద ఉండే తనగుడిసె దగ్గరకు చేరుకున్నాడు. పూర్తిగా శిధిలమైపోయి, మట్టిముద్దయింది. జైల్లో సంపాదించుకున్న డబ్బుతో అక్కడ ఒక గుడిసె వేశాడు. తాను ఇక్కడ వుంటే మనవడు ఏదోరోజు వస్తాడన్న ఆశ అతడిని తిరిగి కాటికాపరిని చేసింది.

వారానికి ఒకసారి ఉత్తరాలు బట్వాడా చేసే పోస్టుమాన్ రహీమ్ గుడిసె ముందు సైకిల్ ఆపాడు. "లోపల ఎవరు? కొంపదీసి సిట్టిరాజుగా! నువ్వు వచ్చేవేట్రా? బేటా గుడిసె బాగా వేసుకున్నావు" అని ఎలుగెత్తి సైకిల్ స్టాండువేసి లోపలకు వెళ్లాడు.

ఆ మాటలకు నులకమంచం మీద నడుంవాల్చి మాగన్నులో ఉన్న ముత్తేలుకు దిగ్గున తెలివొచ్చింది. మనవడుకోసం ఎవరు వచ్చారా అని లేచి కూర్చున్నాడు. ఎదురుగా కనిపించిన పోస్టుమాన్‌ను చూసి "నువ్వా రయిమ్, నా మనవడు ఎక్కడుంది నీకు తెలుసా?" ఆత్రంగా అడిగాడు.

"అరెరే నువ్వు ఎప్పుడొచ్చావు ముత్తేలా? జైలు అయిపోయిందా, నీ మనవడు ఎక్కడుంది ఈగేమంలో ఎవడికి తెల్వదు. అందుకే ఎవడూ చెప్పి వుండడు" నులకమంచం మీద కూర్చుంటూ అన్నాడు.

"కొంపదీసి ఆడు నాలాగునే జైలుపాలయిపోనాడా? పెద్దరైతు సెప్పకనే సెప్పినాడు. ఆడు ముదనష్టపోళ్లతో తిరిగి పాడయిపోనాడని"

"ఛత్ అవేంమాటలు. చిట్టిరాజుగాడు బంగారం. ఆడు ముత్తేలు మనవడు. దొంగోడు కాలేదు. దొరైపోనాడు. మిలట్రీకి ఎల్లిపోయి నాకు ఆరుమాసాలకో, రెజిమెంట్లు, క్యాంపులు మారినపుడో ఉత్తరం ఏస్తాడు. రయిమ్ బాయి ఏప్పుడైనా మాతాత ఒస్తే నాకోపాలి ఉత్తరం రాసిపెట్టు నేను రెక్కలు కట్టుకుని వొత్తాను. ఆడిని చూసి సానాళ్లయింది. తాత ఏజైల్లో ఉంది తెల్వదు. పెద్దరైతును అడిగితే కసురుకుంటాడు. అందుకే ఆ

ఊరు రాబుద్దికాదు అని ఉత్తరంలో రాసి ఏస్తనే ఉంటాడు".

ఆ మాటలకు చేష్టలుడిగిపోయాడు. "ఏటి రయిమ్‌బాయ్ సిట్టిరాజుగాడు మిలట్రీకి ఎలా ఎల్లిపోనాడు. ఇది నేను నమ్మడానికి దయిర్యం సాలడంలేదు. బుక్కడు గంజినీళ్లు ఆడికి ఏసినోడు లేదు. ఆరోజు నేను ఎంతసెబుతున్నా ఇనకుండా నన్ను జీబు ఎక్కించి పోలీసోళ్లు పట్టుకుపోనారు. మళ్లీ ఇప్పుడు ఒచ్చాను. నాకు, ఆడికి నాఅంటూ ఎవరూ లేరు. పాపం పదేళ్ల నలుసు. ఎలాబతికాడో? ఈరోజు మిలట్రీకి ఎల్లాడంటే మాటలా?" కళ్లు తుడుచుకున్నాడు.

"ముత్తేలూ దిక్కులేనివాడికి ఆ అల్లాయే దిక్కని నీకు తెల్వదా? నేను పొరుగూరోడిని, వారంకి, పదిరోజులకి ఉత్తరాలు తెస్తాను. మర్డర్ కేసులో నువ్వు పెద్దరైతు కారణంగా ఇరుక్కున్నావని అందరికీ తెలుసు. రెండుపార్టీలవాళ్లు తన్నుకుని ఖతమైతున్నారు. అందులో మనలాంటోళ్లం బలవుతున్నాం. నీ మనవడు దిక్కులేని వాడిలా ఈగుడిసెలో పడుంటే ఒకరిద్దరు ఏదో ఉడతాసాయం చేశారే తప్ప ఆడి ఆకలి తీర్చలేకపోయారు. మనూరి సత్యం మాస్టారికి చెప్పాను. ఆయనే వచ్చి సిట్టిరాజుగాడిని తీసుకుని వెళ్లి బడిలో వేసుకుని హాస్టల్‌లో చేర్చాడు. పది పాసయ్యాక ఆడు పట్టణంలో నలుగురు కుర్రాళ్లతో కాంట్రాక్టరు దగ్గర పనికి కుదిరాడు. ఆతరవాత ఆడి నేస్తాలు మిలట్రీకి వెడితే ఈడూ వెళ్లాడు. ఆ మధ్య ఉదంపూర్‌లో ఉన్నాడు. ఇప్పుడు కార్గిల్ దగ్గర డ్యూటీలో ఉన్నాడు".

ఆ మాటలు అంతులేని ఆశ్చర్యంతో విన్నాడు.

"ముత్తేలు! ఏటి నోరు తెరిచి అలా ఉండిపోనావు? సిట్టిరాజుకు నేనంటే చాలా గౌరవం. ఏ పని చేసినా నాకు చెప్పి సేస్తాడు. ఆడికి మాగొప్ప విశ్వాసం. అలాగే సత్యం మాస్టారుకి చెబుతాడు. ఆయన రిటైర్ అయిపోయి ఇప్పుడు ఆళ్ల సొంతూరు ఎల్లిపోనాడు".

"రయిమ్ నేను జైలుకు ఎల్లడమే మంచిదయ్యింది. ఆడికి మిలట్రీకి ఎళ్లేయోగం కలిగింది. లేకుంటే ఇక్కడే నాతోబాటు పీనుగులు తగలేసేవాడే".

రహీమ్ లేచి "సరేలే సిట్టిరాజుకు ఈరోజే ఉత్తరం ఏస్తాను. త్వరలో వచ్చేట్టు చూస్తాను. అన్నట్టు ఆడు వచ్చేలోపు మంచి సంబందం ఒకటి చూసిపెట్టు. ఆడు ఎక్కడా ఎలాటి లవ్వుగివ్వులో లేడు. ఆడి ఇసయాలు నాకు బాగా తెలుసు" చెప్పి సైకిల్ ఎక్కాడు.

ముత్తేలుకు గొప్ప ఆనందం వేసింది. అంతవరకు ఉన్న దిగులు, ఆవహించిన నీరసం ఒక్కసారి అతన్నుంచి దూరమయిపోయాయి.

❖ ❖ ❖

ముత్తేలుకు దూరపు బంధువులపిల్ల ఉందని తెలిసింది. పక్కగ్రామంలో సంబంధం మరీ మంచిది అనుకుని అయ్యోరును మంచిరోజు అడిగి ఉతికిన బట్టలు వేసుకుని బయల్దేరాడు. ఆ బంధువులు ముత్తేలును చూసి ఖూనీకోరు ఎందుకొచ్చాడా అని ముఖాలు చిన్నవి చేసుకున్నారు. తాను ఎందుకొచ్చాడో చెప్పటానికి ముత్తేలుకు గుండె ధైర్యం చాలలేదు. తప్పదు, వచ్చాక ముంత దాస్తే చల్ల ఎప్పుడు వచ్చి ముంతనిండుతుంది అనుకుని "ఒరేయ్ సివాలూ, నీ కూతురికి సంబందాలు చూస్తన్నావంట. అది మాట్లాడ్డానికే నేను వచ్చింది" వాళ్లు కూర్చోమని చెప్పకపోయినా చొరవగా కూర్చున్నాడు.

శివాలుకు కోపం తారాస్థాయికి అందుకుంది. "ఎంట్రా నువ్వు సగం జీవితం జైల్లో గడిపేసి ఇప్పుడు ఆపాపపు సేత్తో సంబందాలు సూద్దానికి సిద్దపడిపోనావా? ఎల్లురాఎల్లు మేము సూసుకుంతాం. నీకో మాట చెప్పాలి. నాకూతురిని నీలాగా పీనుగులు తగలేసేవోడికి సచ్చినా ఇయ్యను. ఉద్యోగం సేసేవోడికి ఇస్తాను. సర్కార్ పనోడికే. అలాంటోళ్లు మన పరగణాలో లేరెహే. అందుకే చాలా దూరంలో ఎతుకుతున్నాను. ఇక ఎల్లిపోరా" చెప్పి తల తిప్పేసుకున్నాడు.

ముత్తేలుపై మండిపడుతున్న తండ్రివైపు అదోలాచూసి ముంతలోనీళ్లు తెచ్చి ముత్తేలుకు ఇచ్చింది సన్నాసమ్మ. ముత్తేలుకు ఆమె గాజుబొమ్మలా కన్పించింది, తెరలుతెరలుగా నవ్వేశాడు. "ఒరోరే సివాలూ! నీ ఆలోచన మంచిదేరా. దీనికి మనలాంటోడితో మనువు సేయకురా, సర్కార్ పనోడేరా దీనికి సరిజోడు. నేను తెచ్చిన మనువు కూడా సర్కార్‌లో తుపాకీ పట్టినోడు మిలట్రీవోడురా!"

ఒక్కసారి ఆ ఇంట్లో అయోమయం చోటుచేసుకుంది. అంతా కట్టకట్టుకుని ముత్తేలు ముందు వాలారు. శివాలు సిగ్గుపడుతున్నట్టు ముఖం పెట్టి ఇబ్బందిపడ్డాడు. అప్పుడు ముత్తేలు వారిని సముదాయించి "మిలట్రీలో ఉంది ఎవరోకాదు. నా మనవడు సిట్టిరాజు. ఆడు ఈ నెలాఖరికి వస్తాడు. మూడునెలలుంటాడు. అయ్యోర్లును అడిగాను, మంచి ముహూర్తాలు ఉన్నాయంట. సేసేద్దాంరా, నాకు ఒక్కపైసా వద్దురా! మీకు ఇవ్వాలనుంటే పిల్లదాని మెడలో ఏసిండిరా లేదంటే లేదు".

"ముత్తేలా! నన్ను సెమించేయరా, నిన్ను కాట్టకుక్కలా కసురుకుంతే నువ్వు పెద్ద మనస్సుతో నీమనవడికి నాకూతుర్ని సేసుకుంతానంటావు" కాళ్లు చుట్టేసుకున్నాడు.

❖ ❖ ❖

ముత్తేలుకు ఆ మరుసటి రోజు నుంచి శివాలు ఇంటినుంచి రెండుపూటలా అన్నం కూరా వస్తుండేది. ఎంత వద్దని చెప్పినా "ముసలాడివి ఏం వండుకుంటావని" శివాలే స్వయంగా తెచ్చి ఇచ్చిపోతుండేవాడు. ఒకసారి ఏకంగా సన్నాసమ్మే వచ్చింది. తొలిసారిగా వచ్చింది కదా అని అప్పటికప్పుడే ఒక కోక, రవికె గ్రామంలో పోలేరమ్మతల్లి గుడి పూజారివద్ద కొనుక్కుని తెచ్చి ఇచ్చాడు. సన్నాసమ్మకు ఆరంగు చీర బాగా నచ్చింది. ఇంటికి వెడుతూ "తాతా ఒకటి అడుగుతాను, కాదనకుండా ఇస్తావా?" అని అడిగింది.

ముత్తేలు ఆమెవైపు ఆసక్తిగా చూశాడు. "అడుగే తల్లీ, ఏదీ ఈతాత నీకు కాదనడు" నవ్వు ముఖమంతా పులుముకున్నాడు.

"సిట్టిరాజు పోటో ఒకటి ఇవ్వకూడదు. నా నేస్తాలు రోజూ అడుగుతున్నారు. మేమేమైనా కొరుక్కుతింటామా? అని అంటున్నారు" సిగ్గుతో నేల చూపులు చూస్తూనే అడిగింది.

ముత్తేలుకు గుండెల్లో రాయి పడింది. అసలు ఆడు ఎలా ఉంటాడో తనకు తెలీదు. ఆ చిన్నతనం, ఆ పసిముఖం తనకు గుర్తు. ఏదో సర్దిసెప్పి సన్నాసమ్మను పంపేసాడు.

నెలాఖరు రానేవచ్చింది. పోలీసు జీబు వచ్చి గుడిసెముందు ఆగింది. ఇన్‌స్పెక్టర్ దిగాడు. "సిట్టిరాజు తాతవు నీవేనా? నీకెలా చెప్పాలో తెలియడంలేదు. అయినా చెప్పక తప్పదు. నీ మనవడు కార్గిల్ సరిహద్దుల్లో శత్రువుల చేతిలో వీరమరణం పొందాడు. ఈ మధ్యాహ్నానికి బాడీ వస్తుంది. ఇక్కడ ఏర్పాట్లు చేయాలి. మీ బంధువులకు కబురంపు. ఎందుకంటే బాడీ వచ్చాక అట్టే ఉంచటం కుదరదు. ఇప్పటికి చనిపోయి పదిరోజులు కావస్తోంది" అని ఇంకా చెపుతుండగా ముత్తేలు కుప్పకూలాడు. నేలను పట్టుకుని భోరున ఏడ్చాడు.

కానిస్టేబుల్స్ అతడిని లేవనెత్తి నులకమంచంమీద కూర్చోబెట్టారు. అప్పటికి పెద్దరైతు, మరికొంతమంది వచ్చిచేరారు. వారంతా అంతులేని ఆశ్చర్యానికి గురయ్యారు. "ఈ కాటికాపరి కొడుకు మిలట్రీకి వెళ్లిపోయాడా? ముసలాడు ఎంత గుట్టుగా దాచాడు. పోనీలే ఛస్తే ఏంటట? లక్షలు వచ్చిపడిపోతాయి. ఇక ముసలాడిని పట్టలేం. వడ్డీలకు తిప్పుతాడు కావాలా?" అని గుసగుసలాడుకున్నారు.

ఆ మధ్యాహ్నం ప్రత్యేక వాన్‌లో చిట్టిరాజు భౌతికకాయం చెక్కపెట్టెలో వచ్చింది. దాన్ని కానిస్టేబుల్స్ మరికొంతమంది జవాన్లు దించారు. చెరువు గట్టుమీద అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. తన మనవడిని కడసారి చూపు చూడాలన్నాడు, "కుదరదు, మొత్తం బ్యాండేజీలతో ప్యాక్ చేయబడింది. అయినా పెట్టె తెరవలేం" అని సర్దిచెప్పారు అధికారులు. ముత్తేలు ఒప్పుకోలేదు. 'చూడాలి, చూడాలి' అని గుండెలు బాదుకున్నాడు. అప్పుడు అధికారులు సరేనని పెట్టె తెరిచారు. గుప్పుమని దుర్వాసన. క్షణాల్లో అక్కడనుంచి ముక్కులు మూసుకుని అంతా దూరంగా జరిగిపోయారు. ముత్తేలుకు అవేవి పట్టలేదు. ఆత్రంగా వెతికాడు. ముఖంవైపున్న బ్యాండేజిలు ఊడగొట్టాడు.

చిట్టిరాజు ముఖం ఉబ్బిపోయి ఉంది. మీసాలు చూసి చేత్తో సర్దాడు. "సిట్టిరాజూ! తాతతో మాట్లాకుండానే సచ్చిపోయావా?" అని అంటూనే మరోసారి కుప్పకూలాడు. అతడికి పక్కకు లాగేసి మిగతాపని పూర్తిచేశారు.

మూడురోజులుగా గుడిసె చిన్నబోయింది. ఎవరూ రారు, తన స్థాయిలో పలరింపులు, ఓదార్పులుండవని తెలుసు. తనకు తానే ధైర్యం చెప్పుకుని ముత్తేలు వండుకుని తిన్నాడు. తను మరికొంతకాలం బ్రతకాలనుకున్నాడు. మిలట్రీనుండి రావాల్సిన డబ్బు వచ్చింది. దానికోసమే తాను బతకాలనుకున్నాడు. ఆడబ్బుకు వడ్డీ ఎంతైనా ఇస్తామని పెద్దరైతుల నుంచి చిన్న రైతుల వరకూ చెవుల్లో ఇల్లు కట్టుకుని అడిగారు.

ముత్తేలు చిన్నగా సన్నాసమ్మ ఇంటికి వెళ్లాడు. వారు ఎందుకొచ్చావన్నట్లు చూశారు. కనీసం చిట్టిరాజు చావు పరామర్శకూడా చేయలేదు. అవేవి పట్టించుకోకుండా "రేయ్ సివాలూ! సన్నాసమ్మ నా మనవడిని మనువాడుతుందని ఆశపడ్డాను. అది జరగలేదు. కానీ సిట్టిరాజు "దానికి మంచి సంబందం చూసిపెట్టు" అనికోరినట్లు ఆడి సివరాఖరి డబ్బు నాసేతికి వచ్చింది. ఇదిగోరా ఈ డబ్బుంచు. దీనికి సర్కార్ పనోడిని చూసి ముడెట్టేయ్! అప్పుడు నన్ను పిలువురా, నా మనవడి పెళ్లి సూసినంత సంబరపడతాను" చెప్పి వారి చేతుల్లో కొంత డబ్బు పెట్టి అక్కణ్ణించి కన్నీళ్లు తుడుచుకుని తన గ్రామం వైపు సాగిపోయాడు.

❋

డా॥ జె.పి. వైద్య

ఆ రోజుల్లో రామబ్రహ్మం గారు 'నాటక కళా పరిషత్'కు సెక్రటరీగా ఉండేవారు. 'బళ్ళారి రాఘవ' నటనా కౌశల్యం, దుర్యోధనుడి పాత్ర పోషణ గురించి క్షుణ్ణంగా తెలిసిన వాడు ఆయన. వారందరు కలిసి కట్టుగా వెళ్ళి బళ్ళారి రాఘవ గారిని 'దుర్యోధనుడి' పాత్ర వేయాలి.... వేసి తీరాలి. అని ఒప్పించడానికి సిద్ధమైపోయ్యారు. మధ్యలో చిన్న తిరకాసు వచ్చింది. ఇంకెవరో 'ద్రౌపది' మీదే చిత్రం తీయబోతున్నారు. ఆయన ఇదే చిత్ర ఇతివృత్తం మీద అదే టైటిల్‌తో, అదే పాత్ర కోసం అగ్రిమెంటు సైన్ చేశాడు అప్పటికే ! చేసేది లేక అవతలి వాళ్ళు టైటిల్ మార్చుకొని 'ద్రౌపదీ మాన సంరక్షణ' అని షూటింగ్ ప్రారంభించారు. ఎప్పుడు, ఎవరు, ఎందుకు, ఎలా ఎన్ని సార్లు తుమ్మారో గానీ- 'ద్రౌపదీ మాన సంరక్షణ' ఏ మాత్రం కాసుల సంరక్షణ పొందకుండా బాక్సాఫీస్ దగ్గర

మీసాలూడిన భీముల వారు

'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అని మనం మురిసిపోతాము.

అలనాటి 'గోల్డ్' కన్నా ఈనాటి 'లొల్లి రీమిక్స్' కూడా ఈ తరం వాళ్ళకు ఎంతో నచ్చువచ్చు. వూరికే నచ్చటం కాదు...'వాహ్‌వా! క్యా బాత్ హై!! లాజవాబ్...! వండర్‌ఫుల్!' అంటూ ఈ తరం ఎగిరెగిరి గంతులేస్తూ ప్రస్తుత 'పరిస్థితులను' తలమీద పెట్టుకొని మరీ వూరేగవచ్చు.

కొత్తలోనూ ఎంతో అర్థవంతమైన చరిత్ర. వర్తమానం, అందాలూ ఉన్నాయి... లేవని కావు...

కాని ఆ పాత మధురం ముచ్చట 'మజా' వేరే!

ఎంత షడ్రసోపేతమైన విందు భోజనం ఉన్నా- 'పెరగన్నం- ఆవకాయ ముక్క' మజా ఏ ఫైవ్‌స్టార్ హోటల్లో లభిస్తుందని?

పైగా.... అక్కడ వేళ్ళు నాకుతూ తినటం... అవ్వ! ఎంతటి అప్రతిష్ట!

పాత జ్ఞాపకాలు...!

ఆలోచనలు పాదరసంలా దొర్లిపోతాయి. జ్ఞాపకాలు అనంతంగా తీగల్లా సాగిపోతాయి.

'కఠిన కావ్యాలనైన క్రీగంట జూచి
ఒప్పగింతును చిన్న తప్పొదలకుండ....
కాని- నాన్న పేరది జ్ఞాపకమ్ములేదు'
అని తమాషాగా అన్నారెవరో!

మనలోనూ 'మహానుభావులు' లేరా? ఇంటి ట్యాక్స్, ఎలక్ట్రిసిటీ బిల్స్, ఎల్.ఐ.సి. ప్రీమియంల ముచ్చట హాయిగా మరచిపోయి- సినిమా పోస్టర్ల ముచ్చట్లు చెప్పి మురిసిపోతూ ఉంటారు.

అలాంటి మురిపాల జిలుగుల పాత జ్ఞాపకాల 'దునియా'లో కాసేపు విహరించి వద్దాం.....! రండి!!

పోతిన శ్రీనివాసరావు గారు ఎప్పుడో కట్టిన మొట్ట మొదటి సినిమా థియేటర్ 'మారుతి సినిమా'. తన టాకీ సినిమాలో ఆయన గారు కొన్ని మూకీ సినిమాలను కూడా ప్రదర్శించారు. అందులో 'ద్రౌపది మాన సంరక్షణ' ఒకటి. ముందు గమ్మత్తు ముచ్చట మీతో చర్చించుకొని - సినిమా ముచ్చట్లను తర్వాత ఓపిగ్గా, తీరిగ్గా నములుకుందాం.

సదరు సంఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.

-"ఒక అమావాస్య నాడు 'ద్రౌపదీ వస్త్రాపహరణం' మూకీ సినిమా విడుదల అయ్యింది. ఉన్నట్టుండి ఒక దృశ్యంలో భీముల వారి మీసం కాస్తా వూడి పోయింది. ప్రేక్షకుల్లో కలకలం సాగింది. గోల గోలగా చర్చ మొదలైంది.

-'అడ్డెడ్డెడ్డె....! భీముల వారి మీసం కూడా వూడుద్దేటీ! ఇదేమి బాగా లేదబ్బీ'... అని ఒకరంటే-

-'అరేcc గిట్లెట్లయింది? గంత పెద్ద మనిషి. చేతులల్ల గద కూడా పట్టుకున్నాడు. మీసం వూడింది గూడ తెల్వదా గాయనకు? ఎట్ల గిట్లయితే?".. అని ఇంకొకాయన తల పట్టుకున్నాడు.

భీముల వారి మీసం ఏం వూడిందో కాని - థియేటర్‌లోని జనం గోల గోలగా ఒక్కుమ్మడిగా లేచి వెళ్ళిపోయారు.

రెండో ఆటకు ఒక్క నరమానవుడు రాలేదు. పైగా వెళ్ళిపోయిన వాళ్ళు ఊరుకోలేదు. ఊరంతా ప్రచారం సాగిపోయింది జోరుగా.

-'ఠాఠ్! ఏం సినీమా అన్నా! అంతగనం మంది ఉండగా భీములోరి మీసం ఊడి పోయా! ఇంకాసేపుంటే.. ఇంకేం ఊడేదో!! ...ఛ....ఛ...' సినిమా థియేటర్ వైపు జనాలెవ్వరూ రాలేదు.

ఒకరిద్దరు దూరం నుంచే చూసి- అగ్గోcc! గదే సెన్మ...! గండ్లనే భీములవారి మీసం వూడింది. ఎర్కేనా! అరేయ్...! ఎటు పోతున్నవ్! ఫాల్తుగా! అటు పోకు....! నీదేమైనా వూడ్తది..! జాగ్రత్త బిడ్డోయ్!' అని భయపెట్టేశారు కూడా!

శ్రీనివాసరావు గారు తీవ్రంగా ఆలోచించారు.

ఒక గొప్ప ఆలోచన తట్టింది.

ఆపరేటర్‌ను దగ్గరికి పిలిచి చెవుల్లో ఊదేశారు–" భీముడి మీసం వూడిన సీన్ దగ్గర్నించి కాస్తంత దూరం దాకా ఫిల్మ్‌ను కత్తిరించేయ్' అని చెప్పారు. 'భీముడూ- మీసం' షాటే మాయం చేసి పారేశాడాయన. తెల్లవారుతూనే పబ్లిసిటీ ప్రారంభించేశారు.

–'మద్రాసు నుంచి సరి కొత్త ప్రింటు తెప్పించారు. ఇందులో భీముడి మీసం వూడిపోదు. గ్యారంటీగా సినిమా మొత్తం మీసం ఉంటుంది'

అంతటితో ఆగక, కరపత్రాలు అచ్చేసి గల్లీ గల్లీలో పంచేశారు ఇంకేముంది!

'థియేటర్ హౌజ్‌ఫుల్' అని ప్రత్యేకంగా చెప్పే అవకాశం ఉందా?

బహుశా 'తెలుగు చిత్ర చరిత్రలో'లో అది మొట్ట మొదటి విజయవంతమైన కత్తెర ప్రయోగం (ఎడిటింగ్) అని మనం గర్వంగా 'జ్ఞాపకం' చేసుకోవచ్చునేమో!

ఆ రోజుల్లో కూడా 'టైటిల్ పోటీలు సాగేవి. నాటకాలనే ఏకంగా సినిమాగా ఉన్నదున్నట్టు చిత్రీకరించేవారు.

1936లో శేషయ్య గారు ఒక సంస్థను స్థాపించారు. దాని పేరు 'సరస్వతీ టాకీస్'. రామబ్రహ్మం, సుబ్బారావు ఆ సంస్థలో భాగస్వాములు. ఆ రోజుల్లో మూసగా పౌరాణిక గాథలే సినిమాల్లా వచ్చేవి. అలా కాకుండా ఏదైనా సాంఘీక గాథను 'చిత్రంగా మలిచి, సొమ్ము చేసుకుందాం అనే ఆలోచనలు మొగ్గవీడి పూలలాగా వెల్లి విరిశాయి వాళ్లల్లో.

–'అసలు కూడా పోద్ది...! తొందర పడమాకు'... అని శేషయ్యగారు అడ్డం పడి బళ్లారి రాఘవాచార్య గారి స్టేజీ నాటకం' ద్రౌపదీ వస్త్రాపహరణం' నే సినిమాగా మార్చేద్దామని బోధించారు.

ఆ రోజుల్లో రామబ్రహ్మం గారు 'నాటక కళా పరిషత్'కు సెక్రటరీగా ఉండేవారు. 'బళ్ళారి రాఘవ' నటనా కౌశల్యం, దుర్యోధనుడి పాత్ర పోషణ గురించి క్షుణ్ణంగా తెలిసిన వాడు ఆయన.

వారందరు కలిసి కట్టుగా వెళ్ళి బళ్ళారి రాఘవ గారిని 'దుర్యోధనుడి' పాత్ర వేయాలి.... వేసి తీరాలి. అని ఒప్పించడానికి సిద్ధమైపొయ్యారు.

మధ్యలో చిన్న తిరకాసు వచ్చింది. ఇంకెవరో 'ద్రౌపది' మీదే చిత్రం తీయబోతున్నారు.

ఆయన ఇదే చిత్ర ఇతివృత్తం మీద అదే టైటిల్‌తో, అదే పాత్ర కోసం అగ్రిమెంటు సైన్ చేశాడు అప్పటికే ! చేసేది లేక అవతలి వాళ్ళు టైటిల్ మార్చుకొని 'ద్రౌపదీ మాన సంరక్షణ' అని షూటింగ్ ప్రారంభించారు.

ఎప్పుడు, ఎవరు, ఎందుకు, ఎలా ఎన్ని సార్లు తుమ్మారో గానీ–

'ద్రౌపదీ మాన సంరక్షణ' ఏ మాత్రం కాసుల సంరక్షణ పొందకుండా బాక్సాఫీస్ దగ్గర ఘోరంగా చతికిల పడింది.

'ద్రౌపది వస్త్రాపహరణ' విజయఢంకా బజాయించి మరీ కాసులు పోగేసుకుంది.

కృష్ణుడిగా సి.ఎస్. ఆర్. ఆంజనేయులు, దుర్యోధనుడిగా యడవల్లి సూర్యనారాయణ, ద్రౌపదిగా కన్నాంబ వేశారు.

నాటక ఫక్కీలో కాకుండా కాస్తంత కొత్తదనం జోడిస్తూ, సినిమా తత్వం బోధిస్తూ తీశారు హెచ్.వి. బాబు గారు. అది ప్లస్ పాయింట్- కన్నాంబ కూడా రంగస్థలం నుంచి వచ్చిన నటి కదా!

1935లో స్టార్ కంబైన్స్ వారి 'హరిశ్చంద్ర' చిత్రం ద్వారా ఆవిడ చలన చిత్ర రంగంలోకి అడుగు పెట్టారు. తమిళం, తెలుగు బాగా తెలిసిన నటి ఆమె!

'హరిశ్చంద్ర'లో చంద్రమతిగా చూశాక ఆమె ద్రౌపదిగా కూడా చక్కగా రాణించగలుగుతుందన్న నిర్మాతల ఆలోచన ఫలించింది.

ఇక సి.యస్.ఆర్. ఆంజనేయులు కూడా ఎంతో గొప్ప అనుభవజ్ఞులైనట్టు దాఖలాలేమీలేవు. 1933లో వచ్చిన 'రామదాసు'లో ఆయనది చిన్న పాత్ర. ఇది రెండో చిత్రం! అది ఆయనకు అదృష్ట దేవతలా కాసులను సమకూర్చి పెట్టడమే కాకుండా మరి ఇతర చిత్రాల్లోనూ అవకాశాలు కల్పించింది.

'తుకారామ్'- 'బాలాజీ'- 'జయప్రద' - 'చూడామణి'-'తల్లిప్రేమ'- 'సుమతి'- లాంటి చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర విజయ ఢంకా మోగించినందు వల్ల ఆయన 'వస్త్రాపహరణం' తర్వాత 'ఖుషీ'గా సాగిపోయారు.

'కాని, ఆయన ఎల్.వి. ప్రసాద్ గారి' గృహప్రవేశం' అనే సాంఘీక చిత్రంలో వేసిన చిన్న హాస్య పాత్ర వల్ల తన ప్రతిభా పాటవాలు చూపగలిగాడు" అని తల నెరిసిన సినీ పండితులు చెప్తూ ఉంటారు.

ఇవన్నీ 1936 నాటి ముచ్చట్లు....! అటే దాదాపు 72 సంవత్సరాల నాటి పాత 'రంగీన్' జ్ఞాపకాలు...!! మీరూ, నేను 'బ్యార్' మని తొలి ఏడుపు ఏడ్వని రోజుల నాటి 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' జ్ఞాపకాలు!!!

మా ఇంటి ముందు మా పూర్వజులు నాటిన 'అలనాటి' మహావృక్షం ఇంకా నిలిచి ఉంది. దాని పూల రేకులు గాలి వీచినప్పుడల్లా మా బాల్కనీ నిండా చెదిరి పడిపోతూ ఉంటాయి. అది చూసి, మేము నాటిన చెట్లు తలలూపుతూ పిడికెడు మీసాలు మెలేస్తూ ఓ పెద్ద మనిషి వచ్చి కూర్చుంటాడు. మమ్మల్ని చూసి ఆదరంగా లేచి 'దండాలు దొరా' అని కదిలి వెళ్ళిపోతూ ఉంటాడు. 1936 తరం వాళ్ళు ఇప్పుడు ఎంత మంది ఉన్నారో తెలియదు. నిజం చెప్పాలంటే, మా పూర్వజులు ఆ 'మహావృక్షాన్ని' నాటిన క్షణాలు మేము చూడలేదు...! మారుతి సినిమాలోని 'మీసాలు వూడిపోయిన భీముల వారినీ కాని,

గాలికి పూరేకులు సుగంధాలు
వెదజల్లుతూ చెదిరినప్పుడల్లా, జ్ఞాపకాల
తెమ్మరలు లేచి పలకరిస్తాయి!

ఈజ్ ఇట్ నాట్ ఎ ఫ్యాక్ట్ - దట్ ఓల్డ్ వజ్ గోల్డెన్? ❄

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్ : 08732223622





వీర వీర గుమ్మడి పండు
జవాబు

వీర వీర గుమ్మడి పండు వీరి పేరు
నరేష్

మనసా... తెలుసా?



హిప్నో కమలాకర్
ఫోన్ నెం 9390044031

పిల్లలు భయపడుతున్నారు!

నా వయస్సు 30 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలు, ట్యూషన్ సెంటర్ నడుపుతున్నాను. నేను అప్పుడప్పుడు కాళ్ళు చేతులు కొట్టుకొని ఎగిరెగిరి పడుతుంటాను. అందరి వైపు సీరియస్‌గా చూస్తుంటాను. నిద్ర సరిగ్గా పట్టదు. దీనితో పిల్లలు భయపడుతున్నారు. నాకు తగిన సలహా ఇవ్వగలరు. డాక్టర్ దగ్గరికి వెళితే ఏమీ లేదన్నారు.

అరుణ్, హయత్‌నగర్.

మీరు 'హిస్టీరియా' అనే మానసిక సమస్యతో బాధపడుతున్నారు. మానసిక సంఘర్షణ ఎక్కువైనా, సామాజిక, ఆర్థిక పరిస్థితులు సరిగా లేక పోయినా, అతి సానుభూతి కోరుకుంటున్నవారిలో ఈ సమస్య వస్తుంది. మనసులో ఉన్న బాధకు చిహ్నాలు ఈ హిస్టీరియా లక్షణాలు. మీరు మీ కుటుంబ సభ్యులతో సరిగ్గా ఉంటున్నారో లేదో పరిశీలించుకోండి. మీలో ఉన్న బాధలను మీ కుటుంబ సభ్యులతో పంచుకోండి. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ దగ్గరకు వెళితే సైకోథెరపి, బిహేవియర్ థెరపి, ఫ్యామిలీ కౌన్సిలింగ్ ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

మగాళ్లన్నా... మనువన్నా విరక్తి!

నేను డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాను. మా నాన్న స్కూల్ ప్రిన్సిపల్. నేను చిన్నప్పటినుండి 7వ తరగతి వరకు మా నానమ్మ, తాతయ్యల దగ్గర చదువుకున్నాను. అపురూపంగా పెరిగాను. ఏదైనా ఒకటి రెండు సార్లు చదివితే వచ్చేసేది. చదువుపైన బాగా శ్రద్ధ ఉండేది. 8వ తరగతిలో మా అమ్మా, నాన్నలు తీసుకొచ్చేసారు. అప్పటి నుండి కూడా మా ఇంట్లో ఎవరో ఒకరు చుట్టాల వాళ్ళని, తెలిసిన వాళ్ళని చదివించడానికి, లేక ఉద్యోగానికి మా ఇంట్లో ఉంటున్నారు. మా నాన్న గారిని ఏమైనా అడగాలన్నా అపార్థంచేసుకొని చదువు తప్పించుకోవడానికో ఇంకా దేనికో సాకు చెపుతున్నానని భావిస్తారు తప్ప నా బాధ అర్థం చేసుకోరు. ప్రతి చిన్న విషయానికి అమ్మని ఎవరి ముందు పడితే వారి ముందు చితక బాదుతారు. మగవారన్నా, వివాహం అన్నా విరక్తి కలుగుతోంది. పరిష్కారం తెలుపగలరు.

సుచిత్ర, నల్గొండ.

ఈ రోజుల్లో ప్రతి వ్యక్తికి ఏదో ఒక సమస్య ఉంటోంది. దీని వల్ల తరచుగా ఆందోళనకు గురౌతున్నారు. ఈ ఆందోళన వల్ల సుఖ సంతోషాలకు దూరమవుతారు. మీరు నానమ్మ, తాతయ్యల దగ్గర అపురూపంగా పెరిగారు. నీవు తల్లిదండ్రుల దగ్గరకు ఎనిమిదవ తరగతిలో రావటం, ఇంట్లో ఎప్పుడూ చుట్టాలు వుండటం గందరగోళంగా అనిపిస్తుంది. మీ నాన్నగారు అంతగా పట్టించుకోకపోవటం వల్ల నీలో వ్యతిరేక ఆలోచనలు పెరిగిపోయాయి. చదువు మీద శ్రద్ధ తగ్గింది. మీ నాన్నగారు మిమ్మల్ని అర్థం చేసుకోకపోవటం తప్పే. మీ నాన్నగారు అందరిని బాగు చెయ్యాలనే ఉద్దేశ్యంతో మీ చుట్టాలను చేరదీసి వారికి చక్కని



అవకాశాలు కల్పిస్తున్నారు. నువ్వు మీ నాన్నగారిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. బాగా చదివే అమ్మాయివి. ఎవరూ నీతో సరిగ్గా ఉండటం లేదని చదవకుండా నీ జీవితాన్ని నాశనం చేసుకుంటావా? సమస్యలు వున్నా చదువు మీద దృష్టి పెట్టడానికి ప్రతియ్నించు. మీ ప్రయత్నమే మిమ్మల్ని గొప్ప వ్యక్తిని చేస్తాయి. ఖాళీగా వుండకుండా ఏదో ఒకటి నేర్చుకోండి. మీరు చక్కని పొజిషన్‌కు వెళితే అప్పుడు మీ నాన్నగారు "నా కూతురు చూడండి, ఎంత గొప్ప వ్యక్తి అయిందో!" అని చెప్పకుంటారు. మీ ఇంట్లో వున్న వ్యక్తులందరితో మంచిగా వుండడానికి ప్రయత్నించు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలు చదవండి. అందరి మగవాళ్లూ మీ నాన్న గారిలా ఉండరు. పాజిటివ్‌గా ఆలోచించు. మీ ఫ్యామిలీ అంతా కలిసి కౌన్సిలింగ్ సైకాలజిస్ట్‌ని కలవండి. ఫ్యామిలీ కౌన్సిలింగ్ ద్వారా మీ నాన్నగారిలో మార్పు రావచ్చు.

ఎలా నేర్చుకోను?

నేను ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. ప్రతి దానికి నేర్చుకో అని అంటున్నారు. అసలు ఎలా నేర్చుకుంటాం. దీనికి సమాధానం చెప్పగలరు?

దీప్తి, గుంటూరు.

చూడడం ద్వారా (విజ్యువల్ లెర్నర్స్), వినడం ద్వారా (ఆడిటరి లెర్నర్), శారీరక కదలికల ద్వారా (కైనస్థిటిక్ లెర్నర్) ద్వారా నేర్చుకుంటారు. నేర్పించటం చాలా కష్టం. నేర్చుకోగలిగే పరిస్థితుల్ని సృష్టించడం ఈజీ. మీకు అనుకూలమైన పరిస్థితులను మీ అంతట మీరే స్వయంగా ఏర్పరుచుకోండి. చదువు అవసరాలను గుర్తించి స్వయం ప్రేరణ పొందటం ద్వారా పరిపూర్ణంగా చదవగలుగుతారు. మీరు చదివేటప్పుడు ప్రతి లైను కింద పెన్సిల్‌ను కదుపుతూ దాని వెంటే మీ చూపు కదిలేలా ప్రాక్టీస్ చేయండి. ఇలా చేయటం ద్వారా విషయాలను స్పీడ్‌గా చదువుతారు. వినికిడి జ్ఞానాన్ని ఈ ప్రపంచంలో ఏ శక్తీ భగ్నం చేయలేదు. పరధ్యానం పోవడానికి కావాల్సింది ఏకాగ్రత, ఆసక్తి, స్వయం ప్రేరణ. వీటి ద్వారా చక్కగా వినడం అలవర్చుకోండి. మీరు వినే మాటల్లోని సారాంశాన్ని ఎక్కువగా గమనించండి. శారీరక కదలికలు, స్పర్శ ద్వారా కూడా విషయాలను గ్రహిస్తాము. నిజానికి కళ్లు తరువాత మైండ్ పవర్‌కు మరింత ఉపయోపగపడేది చెవులే. పంచేంద్రియాల ద్వారా నేర్చుకున్న విషయాలే మైండ్‌లో బలంగా నాటుకుపోతాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలో పంచేంద్రియాలు మనకు ఎంతో శక్తివంతమైన సేవలను అందిస్తాయి. కాబట్టి వాటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

విజ్ఞాన వీచిక

అధిక ఆక్సిజన్‌తో చేటు

ఎప్పుడైతే మెదడుకి ఆక్సిజన్ సరఫరాలో తేడా వచ్చిందో - రక్త పీడనాన్ని నియంత్రించే హిప్పోకాంపస్, కార్టెక్స్, భావోద్వేగాలను పర్యవేక్షించే ఇన్సులాలు విపరీతమైన ఒత్తిడికి గురయ్యాయి. దాంతో హైపోథలామస్ (ఇది గుండె కొట్టుకునే వేగాన్ని, హార్మోన్ల స్రావాన్ని నియంత్రిస్తుంది) పై అధిక పీడనం పడుతుంది. పర్యవసానంగా విపరీతమైన మోతాదులో హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మీటర్లు రక్తంలోకి విడుదలౌతాయి. ఇవన్నీ కలిసి గుండె పని విధానంపై ప్రభావాన్ని చూపుతాయి. ఈ చర్యలన్నీ ప్రాణాల్ని నిలపడం కంటే ఇబ్బందికి గురి చేయటంలో తమ ప్రతాపాన్ని చూపేవి.

ప్రాణవాయువు అంటే ప్రాణాలను నిలిపేది. జీవించడానికి అవసరమైనది. 'అటువంటి ప్రాణవాయువు ఎంత ఎక్కువగా ఉంటే అంత మేలు. ఎంత స్వచ్ఛంగా ఉంటే అంత మెరుగు' అనుకునేవారికి ఇదొక వార్త! ఏ 'జీవి'లోనివైనా - కణాలు ఆక్సిజన్‌ను తీసుకుని అవసరమైన జీవచర్యలను కొనసాగిస్తాయి. అలా ఆక్సిజన్ కణాల వరకూ చేరడానికి ఎన్నో సంక్లిష్టమైన ప్రక్రియలు జీవులలో అభివృద్ధి అయ్యాయి. కొన్నిసార్లు ఆక్సిజన్ తక్కువైనా, అసలు లేకపోయినా సదరు చర్యలు కుంటుపడతాయి. ఫలితంగా - జీవి జీవించడం ఆగిపోతుంది.

వైద్యరంగంలో కూడా, పేషెంట్ ఊపిరి పీల్చడానికి ఇబ్బంది పడుతుంటే వారికి ఆక్సిజన్ వాయువుని ధారాళంగా సరఫరా చేయడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఒకప్పుడు (కొన్నేళ్ళక్రితం) నగరాలలో 'ఆక్సిజన్ బార్'లు వెలిశాయి. కాలుష్యమైన నగర గాలిని పీల్చి పీల్చి ఇబ్బంది పడే ప్రజలారా ఈ 'బార్'లకు వెళ్ళి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను గుండెలనిండా పీల్చుకుని ఆరోగ్యంగా ఉండండి అన్నది ఈ ఆక్సిజన్ బార్‌ల ఉద్దేశం. మరో పక్క - మీరు తాగే నీటిలోనూ ఆక్సిజన్ తక్కువ ఉండే అవకాశం ఉంది, కాబట్టి ఆక్సిజన్ రెండింతలు నింపిన మంచినీటిని తాగండి' అని ఒక 'మినరల్ వాటర్' బ్రాండు మార్కెట్లోకి వచ్చింది.

స్వచ్ఛమైన ఆక్సిజన్ కోసం అన్వేషణ అంతా ఇంతా కాదు. కానీ ఆక్సిజన్ స్వచ్ఛంగానూ, అధికంగానూ తీసుకుంటే నిజంగానే లాభదాయకమా? అన్న ప్రశ్న విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న దశలనుండి ఉత్పన్నమౌతూనే ఉంది. కానీ సమాధానాలే భిన్నంగా వస్తున్నాయి.

ఇప్పుడు తాజాగా వచ్చిన పరిశోధనా ఫలితాలు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ని అధికంగా తీసుకోవడం వల్ల లాభంకన్నా నష్టమే అధికమని తేల్చి చెప్పాయి. పైగా అటువంటి ప్రాణవాయువు ప్రాణాన్ని సైతం తీయవచ్చని వాటి సారాంశం.

కొంతమందికి స్వచ్ఛమైన (100%) ఆక్సిజన్ని 5 నిమిషాల పాటు పీల్చుకున్న తరువాత, వారినుండి వేగంగా కార్బన్ డయాక్సైడ్ బయటకు రావడం జరిగింది. అయితే శరీరంలో కార్బన్‌డయాక్సైడ్ తగ్గిపోవడంతో రక్తనాళాలు కుంచించుకు పోతాయి. ఆక్సిజన్ మెదడుకీ, గుండెకీ వెళ్ళకుండా ఆపబడింది.

ఎప్పుడైతే మెదడుకు చేరే ఆక్సిజన్ సరఫరాలో తేడా వచ్చిందో - రక్త పీడనాన్ని నియంత్రించే హిప్పోకాంపస్, కార్టెక్స్, భావోద్వేగాలను పర్యవేక్షించే ఇన్సులాలు విపరీతమైన ఒత్తిడికి గురయ్యాయి. దాంతో హైపోథలామస్ (ఇది గుండె కొట్టుకునే వేగాన్ని, హార్మోన్ల స్రావాన్ని నియంత్రిస్తుంది) పై అధిక పీడనం పడుతుంది. దాంతో విపరీతమైన మోతాదులో హార్మోన్లు, న్యూరోట్రాన్స్‌మీటర్లు రక్తంలోకి విడుదలౌతాయి. ఇవన్నీ కలిసి గుండె పనిచేసే విధానంపై ప్రభావాన్ని చూపుతాయి.

ఈ చర్యలన్నీ ప్రాణాల్ని నిలపడం కంటే ఇబ్బందికి గురి చేయటంలో తమ ప్రతాపాన్ని చూపేవి. దశాబ్దాల కాలంగా ప్రాణసంకటంలో ఉన్న వారికి 100శాతం ఆక్సిజన్‌ని ఇవ్వడం దాదాపు అన్ని ఆసుపత్రులలో అవలంభిస్తున్న పద్ధతే. అయితే కొన్ని ఆసుపత్రులు - ముఖ్యంగా యూరప్‌లో సాధారణంగా గాలిలో ఉండే వాయువులను (నత్రజని, కార్బన్ డయాక్సైడ్, ఆక్సిజన్) అదే మోతాదులో కలిపి ఇవ్వడం ఆరంభించాయి.

ఆక్సిజన్ ఒకరకంగా ప్రమాదకరమైన వాయువు. అధికశాతం ఆక్సిజన్ అత్యంత వేగంగా మండుతూ విధ్వంసానికి దారితీస్తుంది. అయితే ఆక్సిజన్ తనంతట తాను మండకపోయినా, మండే ప్రక్రియను వేగిరం చేస్తుంది. అటువంటి ప్రమాదాన్ని నివారించడానికే అన్నట్టు వాతావరణంలో ఆక్సిజన్ 21 శాతానికి మించకుండా ఉంటుంది. పైగా నత్రజని అనే ఒక జడవాయువు కూడా ఆక్సిజన్ని అదుపులో ఉంచుతుంది. అలాంటిది, అటువంటి ప్రమాద హెచ్చరికా సంకేతాలను పట్టించుకోకుండా 100శాతం ఆక్సిజన్ మంచి చేస్తుందనుకోవడం మంచిదికాదు అంటున్నారు పరిశోధకులు.

ఆక్సిజన్ చాలా తక్కువగా ఉండే ప్రదేశాల్లో - హిమాలయాలు, సముద్రాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో ఆక్సిజన్ పీల్చవలసి వస్తుంది కాబట్టి ఆక్సిజన్ ట్యాంకులు వాడతారు. అధికంగా ఆక్సిజన్‌కి బహిర్గతమైతే ఊపిరితిత్తులు దెబ్బతింటాయని నిరూపించబడింది. 50 - 100 శాతం ఆక్సిజన్ని సాధారణ పీడనంలోనే ఎక్కువసేపు పీల్చుకోవడం వల్ల ఊపిరితిత్తుల లోపలి తలం దెబ్బతింటుంది.

కాబట్టి ప్రాణవాయువు అంటున్నాం కదా అని అదే పనిగా ఆక్సిజన్ని పీల్చకూడదనేది సారాంశం. ఏదేమైనా అతి అనర్థమే! ❋

నవ్వుల్-పువ్వుల్



లైట్ ఫుడ్

అప్పారావు: ఏరా ఏమిటి లైటు స్థంభంవైపు నోరు తెరుచుకొని చూస్తున్నావ్ చాలా సేపటి నుంచి?

సుబ్బారావు: ఏం లేదురా లావు తగ్గటానికి లైట్ ఫుడ్ తీసుకోవాలని డాక్టర్ చెప్పాడు !!

కథా నిలయం
శ్రీకాకుళం

సాహితీవేత్తల జ్ఞాపకాలు

డా॥ దేవరాజు మహారాజు స్వీయ సాహితీ అనుభవాలు, సాహితీవేత్తల(తో) పరిచయాలు, జ్ఞాపకాలు, ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు కవులతో తనకు గల సా(న్ని)హిత్య పరిచయాలను "స్మృతి సుగంధం"గా ప్రచురించారు. సంఘం (2007)లో ప్రచురించిన "వజ్రభారతి" లోని వ్యాసం, ప్రజాశక్తి (సవ్వడి), ఆంధ్రజ్యోతి, ప్రజాతంత్ర, ఆంధ్రభూమి "సాహితి', ఢిల్లీ తెలుగు వాణి, కొన్ని ప్రత్యేక సంచికల కోసం రాసిన వ్యాసాల అక్షర సమాహారమే ఈ "స్మృతి సుగంధం"- ఇదో మంచి ప్రయత్నం.

చాసో, రంధి సోమరాజు, హరి ఆదిశేషువు, వెల్దుర్తి మాణిక్యరావు, సుద్దాల హన్మంతు, శార్వరి, డి. రామలింగం, దాశరథి, పొట్లపల్లి రామారావు, కాళోజీ, రారా, మధురాంతకం, రంగాచార్య, మరిగంటి, సోదుం జయరాం, గూడూరి సీతారాం, కోదాటి నారాయణ రావు, జనపరెడ్డి, వేముల పెరుమాళ్ళు, కాలేజి రాజు, లైబ్రేరియన్ రాజు, సి.సుదర్శన్, మహీధర నళినీ మోహన్, కపర్ది, శీలా వీర్రాజు, త్రిపురనేని లాంటివారి గురించి రచయిత విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు.

స్వాతంత్ర్య పోరాటోద్యమానికి ధీటుగా, వీర తెలంగాణా సాయుధ రైతాంగ ప్రజా పోరాటం ఎందరో కవుల్ని కళాకారుల్ని, నవలాకారుల్ని, గాయకుల్ని చిత్రకారుల్ని ప్రభావితం చేసింది. విప్లవ పోరాటోద్యమ ప్రజాసాహిత్య సృజనకు పథ నిర్దేశం చేసింది.... తెలంగాణా ప్రజల భాషలో వచ్చిన తొలి నాటిక "దయ్యాల పన్గడ". రచయిత వెల్దుర్తి మాణిక్యరావు గారి సామాజిక సేవ, నిజాం కాలంలో "మద్యపాన నిరోధక పత్రిక" సంపాదకత్వం, ఆ తర్వాత "గోలకొండ" పత్రిక సహాయ సంపాదక బాధ్యతలు... (పేజీ 27) నేటి తరం నాటక రచయితలు అధ్యయనం చేయాల్సిన అంశాలు బాగా రాశారు. అలాగే సుద్దాల హనుమంతు (పేజీ29) కాళోజీ (58వ పేజీ) దాశరథి (పేజీ



41), దాశరథి రంగాచార్య (69) లాంటి సాహితీ యోధుల్ని పరిచయం బాగానే చేశారు. కానీ కోటి రతనాల వీణ మోగించిన దాశరథిని కీర్తించటం బాగానే వుంది గాని అందుకోసం దేవరాజు శ్రీశ్రీ ని తక్కువ చేసి రాయడం ఉచితంగా లేదు. (పేజీ 41)

"శ్రీశ్రీ ఒక చిన్న ఉద్యోగం కోసం నైజాం ప్రభుత్వం చుట్టూ తిరిగాడన్నది మరువ కూడదు" అంటారు రచయిత. 'దాశరథి పొరపాట్లను గుర్తుంచుకున్నారు' అన్నారు రచయిత. నిజమే.... ఇందిరమ్మ ఎమర్జెన్సీ జలగం వెంగళరావు అకృత్యాన్ని కీర్తిస్తూ... అక్షర "దీక్ష" సాగించిన దాశరథిని ఒక్క కలం పోటుతో ఎన్టీరామారావు అకాడమీ కుర్చీలోంచి తొలగిస్తే కోర్టు కెళ్ళిన చరిత్ర వుంది కదా!!

పొట్ల పల్లి రామారావు గారి గురించి మరి కాస్త విపులంగా రాస్తే బాగుండేది (పేజీ 45). రారా (పేజీ 62) వ్యాసం కూడా ఆయన మార్క్సిస్ట్ విశ్లేషణ - విమర్శనపై మరింత విపులంగా వుంటే బాగుండేది.

'సోదుం జయరాం' (పేజీ 79) వ్యాసం బాగుంది. ముందుతరం తెలంగాణ రచయితల్లో చెప్పుకోదగ్గ "గూడూరి సీతారాం" (పేజీ 84) కథలపై మరింత విశ్లేషణ ఇస్తే బాగుండేది.... సుందరయ్య విజ్ఞాన కేంద్రం లైబ్రేరియన్ రాజు (పేజీ 104) తెరచిన పుస్తకం "కపర్ది" (పుట 116) వ్యాసాలు బాగున్నాయి.

ముద్దసాని రాంరెడ్డి (కరీంనగర్), ఎం.వి. తిరుపతయ్య (వరంగల్) లపై మరింత సమాచారం రాస్తే (పేజీ 14) బాగుండేది....రోడ్డు ప్రమాదానికి గురై ఏళ్ళ తరబడి మంచం మీద పడి ఉండాల్సిన (దు)స్థితిలో కూడా ముద్దసాని తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోక మంచం మీద బోర్లా పడుకునే గ్రంథం రాసిన రచయిత ఆయన. నక్సలైట్ సానుభూతి పరుడని జైల్లో పెట్టినా క్యాన్సర్ వ్యాధి దాడి చేసినా- అధ్యాపకుడైనా అలుపెరుగని "అక్షర జీవన సమరం" (నవల) సాగించిన తిరుపతయ్యల గురించి నేటి తరం కవులకు రచయితలకు తెల్సుకోవాల్సిన అవసరం ఎంతో వుంది... కవుల గురించి నవలా కారుల గురించి సంపాదకుల గురించి కథా రచయితల గురించి రాసే సందర్భంలో... ఆయా రంగాల్లో ప్రసిద్ధులైన మరి కొందర్ని (వీలైతే అందర్నీ) గ్రంథస్థం చేస్తే బాగుండేది. మలి ముద్రణల్లో ఆలోచించగలరు. తన గురించి తన కాలాన్ని గురించి రాసే వాడొక్కడే సర్వ ప్రజల్ని గురించి సర్వ కాలాన్ని గురించి రాసే వాడుగా గుర్తింపు పొందుతాడు" అంటాడు షెల్లీ. ఆ ప్రయత్నాన్ని కవి దేవరాజు మహారాజు కొంతమేరకు కొనసాగించినందుకు అభినందనీయులు.

రచయిత: దేవరాజు మహారాజు
పేజీలు: 170, వెలం 100/- రూ
ప్రతులకు: శ్రీమతి కృష్ణకుమారి, జి-4, లాహిరి ఎస్టేట్స్, కృష్ణవేణి నగర్ 40-241/2, మౌలాలి, హైదారబాద్-40, నవోదయ, విశాలాంధ్ర, ప్రజాశక్తి బుక్‌షాపులు.

-తంగిరాల చక్రవర్తి



హైకూ రమణీయం

పి.వి. రమణారావు

వెల:15/-,
పేజీలు:32
ప్రతులకు:
పి. భారతి, ఇం.నెం.
17-44, సరస్వతి సదనం, నేతాజీ రోడ్,
సత్తుపల్లి, ఖమ్మం.



స్మైలీ

తోటకూర వేంకటనారాయణ
వెల:30/-, పేజీలు:55
ప్రతులకు:
తోటకూర రామసీత
3-170, 5వ లైన్
పందరీపురం,
చిలకలూరిపేట, గుంటూరు.



ఆ ఇంటి వెడల్పు మీటరే!

ఎక్కడైనా మీటరు వెడల్పు, పది మీటర్ల పొడవు వున్న ఇల్లు చూశారా! "అసలు అంత ఇరుకు ఇల్లు తలకాయ వున్నవాడెవడైనా కట్టుకుంటాడా! వుంటాడా!?" అన్నట్టు చూస్తున్నారేంటి? అలాగైతే మీరు తప్పనిసరిగా బ్రెజిల్ వెళ్లిరావాల్సిందే. ఎందుకంటే ఆ దేశంలోని మాడ్రే డే డ్యూస్ అనే చిన్ని పట్టణంలో సదరు కొలతలతో కట్టిన ఇల్లు ఒకటి వుంది. ఆ మధ్య హెలినిటా అనే మహిళ ఆ కొలతలతో ఇల్లు కట్టుకుంటానని మున్సిపాలిటీ అధికారులకు దరఖాస్తు పెట్టుకుంటే మొదట కుదరదన్నా... తర్వాత ఓకే చేశారు. ఒకేసారి మీటరు వెడల్పున్న గదులతో మూడు అంతస్థుల భవనం కట్టేసింది. అంతేకాదండోయ్! ఈ ఇరుకు భవనంలోనే ఎంచక్కా వుంటున్నారు హెలినిటా దంపతులు. పన్నెండువేల మంది జనాభా వున్న ఆ చిన్ని పట్టణంలో ఈ ఇంటికి మాంచి డిమాండ్ ఏర్పడింది. ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చి చూడడమేకాక కాసేపు అక్కడే ఇంటి ముందు బెంచీలమీద కూర్చుని పోతుంటారు. ఆసక్తి వున్న వారు ఇంటిలోపల ఫొటోలు కూడా తీసుకుంటుంటారు. ఇప్పుడు ఇంటి యజమానురాలు హెలినిటా నాలుగో అంతస్థు వేయడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది.



AP's First ISO 9001:2000 Certified Mobile Chain Store
మొబైల్స్ విక్రయంలో నమ్మకమైన పేరు
కథా నిలయం
శ్రీకాకుళం
NOKIA
Sony Ericsson
SAMSUNG mobile
MOTOROLA
aimvyapthi.com
రూ. 27 లక్షల విలువగల
మెర్సిడీస్ బెంజ్ కారు
మీ స్వంతం చేసుకోండి.
25 లక్షల పైగా
హ్యాపి కస్టమర్లైన శుభతరుణంలో...
ఒక కోటి ఆఫర్
బంపర్ బొనాంజా
ప్రతి వారం 100 బహుమతులు
ఎయిర్ కండిషనర్స్ | యల్.సి.డి టివిలు | డివిడి ప్లేయర్స్ | మొబైల్ ఫోన్స్ | గోల్డ్ కాయిన్స్ | డిజిటల్ కెమెరాస్ | బ్లూటూత్ హెడ్‌సెట్స్ | ఐపాడ్స్ | క్యాష్ వౌచర్స్.....
IMI అనుమతితో ఒర్జినల్ MP3 రింగ్ టోన్స్ డౌన్‌లోడింగ్ చేయబడును
NOKIA Sony Ericsson SAMSUNG mobile MOTOROLA LG i-mate fly htc Virgin mobile Airtel TATA indicom RELIANCE vodafone Idea CellOne
హైదరాబాద్: ఎస్.డి. రోడ్, హబ్సిగూడ, బేగంపేట్, అమీర్‌పేట్, కుకట్‌పల్లి, హై-టెక్ సిటీ, పంజగుట్ట, హిమాయత్‌నగర్, నేరేడ్‌మెట్, గ్రీన్‌ల్యాండ్స్, మెహదీపట్నం, చందానగర్, దిల్‌సుఖ్‌నగర్. అనంతపూర్: సుభాష్ రోడ్. హిందూపూర్: అంబేద్కర్ సర్కిల్ దగ్గర. విజయవాడ: ఎం.జి రోడ్ - అరండల్‌పేట్ - ఏలూరు రోడ్. రాజమండ్రి: జెపి రోడ్ - టి. నగర్. కాకినాడ: వెల్‌కమ్ హోటల్ ప్రక్కన. విశాఖపట్టణం: గోపాలపట్టణం - దాబా గార్డెన్స్ - పాత గాజువాక. భీమవరం: పి.పి. రోడ్. పాలకొల్లు: పెద్దగోపురం ఎదురుగా. తణుకు: ఆర్.పి. రోడ్. ఏలూరు: ఆర్.ఆర్.పేట్. ప్రొద్దుటూరు: మైదుకూరు రోడ్. కడప: నాగరాజ్‌పేట. మదనపల్లి : సిటిఎం రోడ్. తిరుపతి: గాంధి రోడ్ - తిలక్ రోడ్. నంద్యాల: శ్రీనివాస సెంటర్. కర్నూల్: హోటల్ మౌర్య ఇన్ కాంప్లెక్స్. గుంటూరు: లక్ష్మీపురం- బ్రాడీపేట. తెనాలి: బోస్ రోడ్. ఒంగోలు: కర్నూలు రోడ్. చీరాల: దర్బార్ రోడ్. ఖమ్మం: మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా. కొత్తగూడెం: కృష్ణప్రసాద్ కాంప్లెక్స్, యమ్.జి.రోడ్. గుడివాడ: గృహమందారం బిల్డింగ్, నెహ్రూ చౌక్, మెయిన్ రోడ్
హెల్ప్‌లైన్ 99663 98888
Big C®
U can't hide temptation
THE TRUSTED NAME FOR MOBILES